
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 10.07.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 06 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

### త్వరలో విస్తరణ

# మంత్రయ్యేదెవరు?






### ఇద్దరికీ ఉంటుందా? ఒకరికే దక్కుతుందా?

**ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జపాన్ పర్యటన నుండి తిరిగి రాగానే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరపనున్నట్లు పక్కా సమాచారం. ఏడాది పాలనలో ఇప్పటికే ఆయన అందరు మంత్రులకు ర్యాంకులు, గ్రేడ్‌లు, మార్కులు కేటాయించి వున్నారు. పనితీరు మెరుగుపరచుకోని నలుగురైదుగురు మంత్రులకు ఉద్వాసన పలకచ్చని తెలుస్తోంది. అసలు ప్రభుత్వ పనితీరే అధ్వాన్నంగా వుంది. అందులో మళ్లీ మంత్రులకు పనితీరు వారీగా ర్యాంకులు ఇచ్చి ఉన్నారు. అంటే చివరి ర్యాంకుల్లో వున్న ఆ మంత్రుల పని ఇంకెంత అధ్వాన్నంగా వుందో వేరే చెప్పనక్కరలేదు.**

మంత్రివర్గ విస్తరణలో ఈసారి కొత్తగా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన ముగ్గురు సీనియర్‌లకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తారనే చర్చ వుంది. వీరిలో పయ్యావుల కేశవ్, గాలి ముద్దుకృష్ణమనాయుడు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి. కొత్తగా ముగ్గురు ఎమ్మెల్సీలకు మంత్రి పదవులిస్తే వారిలో రెడ్డి సామాజిక వర్గం నుండి ఒకరిని మాత్రమే తీసుకునే అవకాశముంది. అది మాగుంట శ్రీనివాసులురెడ్డా... సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డా? అనేది సందేహం. ఇద్దరూ నెల్లూరుజిల్లా వాళ్లే. కాకపోతే మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రకాశం జిల్లా నుండి ఎమ్మెల్సీ అయ్యారు కాబట్టి నెల్లూరుజిల్లా లెక్కలోకిరాడు. మాగుంట శీనయ్య ప్రకాశం నుండి ఎమ్మెల్సీకి పోటీ చేసిందే మంత్రి పదవి హామీ మీద. లేకుంటే ఆయన ఎమ్మెల్సీ స్థాయికి దిగేవాడు కాదు. మంత్రివర్గంలో రెడ్డి సామాజికవర్గం నుండి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పల్లె రఘునాథరెడ్డిలు మాత్రమే వున్నారు. ఐదు జిల్లాల్లో రెడ్ల ప్రాబల్యం వుంది. కాబట్టి (మిగతా 11వ పేజీలో)

# తమిళనాట తెలుగు వెలుగు



తమిళనాడు రాష్ట్ర జనాభాలో **27.12%** తెలుగువారే వున్నారు


# 1,95,00,000

ఒక కోటి తొంభై అయిదు లక్షల మంది తెలుగువాళ్లున్నట్లుగా తాజా గణాంక వివరాల ప్రకారం తేలింది.

తమిళనాడులో తెలుగువాళ్ళ సంఖ్య దాదాపు రెండు కోట్లకు చేరుకుంటోందంటే అతిశయోక్తి కాదు. ఇదెంతో సంతోషదాయకం.. ఎంతో గర్వకారణం కూడా. ఒక అనధికారిక సర్వే ప్రకారం ఆ సంఖ్య అక్షరాలా కోటీ తొంభై అయిదు లక్షలదాకా వుంది. తమిళనాడు రాష్ట్ర జనాభాలో 27.12 శాతం తెలుగువారేనంటే ఆశ్చర్యమే మరి. (మిగతా 11వ పేజీలో)




### • పుష్కరాలకు 1400కోట్లు
### • ఎమ్మెల్యే నిధులకు తూట్లు



# గోదావరిలో నిధుల వరద

***గాల్లో మేడలు కట్టడం, లోపల చిరుగుల బనియన్, డ్రాయర్ వేసుకున్నా పైన కోటు బూటూ వేసుకోవడం, రేపోమాపో కూలిపోయే ఇంటికి అందమైన వెల్వేషన్ చేయించడం చంద్రబాబుకు సరదా! లోపల లొట్ట వున్నా పైకి ఆకర్షణీయంగా కనిపించాలనేది ఆయన పాలసీ!***

1995-2004ల మధ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఆయన చేసిన పనులన్నీ కూడా ఇలాంటివే! ప్రజలు వెళ్లే దారుల్లో తారురోడ్లకు గతిలేకపోయినా పశువులు నడిచే పొలాల్లోకి సిమెంట్‌రోడ్లు వేయించిన ఘనాపాటీ చంద్రబాబు. 70శాతం మంది ప్రజలు బ్రతుకుదెరువు కోసం ఆదారపడ్డ వ్యవసాయ రంగాన్ని ఎండగట్టి కేవలం నాలుగైదు శాతం మందికి ఉపయోగపడే సాఫ్ట్‌వేర్ రంగం కోసం వేలకోట్లు తగలేసాడు.

ఇప్పుడన్నా పంథా మారిందా అంటే అదీ లేదు. ముఖ్యమంత్రి అయ్యింది మొదలు అన్నీ పైనపటారం పనులే! ప్రజలకు శాశ్వతంగా (మిగతా 11వ పేజీలో)

# సర్కార్ బడులకు మహర్దశ

స్వచ్ఛభారత్ – స్వచ్ఛ విద్యాలయ టాయిలెట్ స్కీం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, న్యూఢిల్లీ వారి ద్వారా నిధులు అందజేస్తుంది. మన జిల్లాలోను ఆ పథకం ద్వారా మొదటి విడతలో 272 పాఠశాలలు ఎంపికయ్యాయి, వీటికి రూ.4కోట్లకు పైగా నిధులు విడుదలయ్యాయి. పాఠశాలల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరుబయటే మూత్రవిసర్జన, బహిర్భూమికి వెళుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నా... విద్యార్థుల సంఖ్యకు తగ్గస్థాయిలో లేవనే విమర్శలున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు స్వచ్ఛభారత్–స్వచ్ఛ విద్యాలయ టాయిలెట్ స్కీం కింద జిల్లాకు రూ.4,48,72,000లు మంజూరయ్యాయి. ఆ నిధులను ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారి ఖాతాలో జమచేసారు. ఆ నిధులతో జిల్లాలోని 46మండలాల్లోని 272పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఈమేరకు కలెక్టర్ ఆమోదం లభించింది. ఒక యూనిట్ క్రింద రూ.1.76లక్షలతో మూడు మూత్రశాలలు, ఒక మరుగుదొడ్డిని నిర్మిస్తారు. వీటి నిర్మాణ బాధ్యతలను జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌కు అప్పగించారు.

# దీక్షా పట్టుదలతో ఉన్నత శిఖరాలకు

విద్యార్థులు దీక్షా పట్టుదలతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు కత్తి నరశింహారెడ్డి అన్నారు. నెల్లూరుజిల్లా నార్తురాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు 4వ తేదీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని దరిచేరనీయకూడదని, విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. క్రమశిక్షణ విద్యార్థుల భవితకు బంగారుబాట వేస్తుందన్నారు. కళాశాల ఛైర్మెన్ పెనుబల్లి బాబునాయుడు మాట్లాడుతూ కళాశాల వార్షిక ఫలితాల్లో 85శాతం ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు కోటిరూపాయలు మెరిట్ విద్యార్థులకు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఐదుమంది ప్రతిభావంతులైన విద్యార్థులకు బంగారు పతకం, నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.దత్తాత్రేయశర్మ, డైరెక్టర్లు ఏ.పట్టాభి, పి.హనుమంతరావు, పి.సీతారామనాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## - టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలను నాటాలని టిటిడి బోర్డు కమిటీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మూర్తినగర్‌లోని గంజిఖానా మునిసిపల్ స్కూల్‌లో మొక్కను నాటారు. ఆ తర్వాత బిజెపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మొక్కలు నాటడమే కాక, వాటిని పెంచే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. ప్రతి బిజెపి కార్యకర్త మొక్కలు నాటాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పార్థసారథి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకరరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక స్థాయి నుంచి యోగా

నెల్లూరుజిల్లాలోని పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి నుంచి యోగా విద్యను తప్పనిసరి చేయనున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఆంజనేయులు అన్నారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలోని ఇండోర్‌స్టేడియంలో జిల్లాలోని వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో వారంలో ఒకరోజు యోగాసనాలకు 30నిమిషాలు కేటాయించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో డివిజన్ల వారీగా వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు మూడురోజుల పాటు ప్రత్యేక సదస్సులో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎతిరాజ్, ఆయుష్ విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ భ్రమరాంబ, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష ప్రధానకార్యదర్శులు సిహెచ్ కృష్ణారెడ్డి, సనత్‌కుమార్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ విక్టర్, జిల్లాలోని పిఇటిలు పాల్గొన్నారు.

# సౌత్‌మోపూరులో 'నీరు-చెట్టు'

నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'నీరు-చెట్టు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కళాశాల ప్రిన్సిపల్ మాల్యాద్రి చౌదరి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని వారం రోజులపాటు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం, కలుజులమిట్ట, ఎస్టీకాలనీలో విద్యార్థులు మొక్కలు నాటారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ పి.వి భాస్కరాచారి, అధ్యాపకులు సునీల్‌శర్మ, రత్నంరాజు, సుధాకర్, సుజాత, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ప్రయోజనకరం

## - గూంటూరు రేంజ్ ఐజి సంజయ్



నెల్లూరుజిల్లా తడ మండలం బీవీ పాలెం రాష్ట్ర సరిహద్దు ఉమ్మడి తనిఖీ కేంద్రాన్ని 4వ తేదీ గుంటూరు రేంజ్ ఐజి సంజయ్, జిల్లా ఎస్పీ గజరావు భూపాల్‌తో కలిసి సందర్శించి స్థానిక పరిస్థితులను గురించి చెక్‌పోస్ట్ పరిపాలనాధికారి వర ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ చెక్‌పోస్టు పరిసరాల్లో భద్రత, వాహనాల ప్రమాదాల నియం త్రణ, ట్రాఫిక్‌జామ్ నుంచి విముక్తి తదితర అంశాలకు సాంకేతిక పరిజ్ఞా నంతో పరిష్కార మార్గాన్ని కనుగొనడమే తమ లక్ష్యమన్నారు. స్థానిక సర్కిల్ పోలీస్ సిబ్బంది జిపిఎస్ వంటి సాంకేతిక పరి జ్ఞానాలు అందుబాటులో లేకుండానే సంప్రదాయ పద్ధతుల్లో నేరాలను సమర్థ వంతంగా ఛేదించడాన్ని ఐజీ అభినందించారు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో తక్కువ సిబ్బందితో ఎక్కువ పని చేయాల్సి వస్తున్న తరుణంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రానికి నెలకు సుమారు రూ.80కోట్ల మేర ఆదాయాన్ని అందించే ఉమ్మడి తనిఖీ కేంద్రంలో ఇబ్బంది లేని విధంగా భద్రత ఏర్పాట్లు చేయాల్సి వుందన్నారు. రహదారిపై సిసి కెమెరాలు, చెకింగ్ స్కానింగ్, తదితర అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించి సహకరించాల్సిందిగా శ్రీసిటి యాజమాన్యాన్ని కోరారు. స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ జయరామ సుబ్బారెడ్డి, గూడూరు డిఎస్పీ శ్రీనివాస్, సూళ్లూరుపేట సిఐ విజయకృష్ణ, శ్రీసిటి భద్రతాధికారి అల్తాఫ్, తడ, సూళ్లూరుపేట ఎస్సైలు సురేష్‌బాబు, గంగాధర్‌రావు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# మద్యంపై మహిళల యుద్ధం

## - ఆత్మకూరులో పెద్దఎత్తున రాస్తారోకో

తమ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలంటూ ఆత్మకూరు వీవర్స్ కాలనీ మహిళలు సోమవారం పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువ అవుతున్నాయని, ఈ నెల 5వ తేదీ రాత్రి కాలనీ వీధుల్లో మద్యం సీసాలను పగులగొట్టి మందుబాబులు వీరంగం సృష్టించారని, మద్యం మత్తులో గొడవలు సృష్టించుకుని కొట్టుకుంటున్నారని, వీటివల్ల ఈ ప్రాంతం భయానకంగా తయారవుతోందని మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆగడాల వల్ల ప్రజలు ఇక్కడ తిరిగేందుకే భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఆత్మకూరు-నెల్లూరు పాళెం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రశాంతంగా వున్న తమ కాలనీలో మద్యం దుకాణం వద్దని చెప్పినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, ఈ ప్రాంతంలో గ్రామదేవత ఆలయం, ప్రభుత్వ వైద్యశాల, ప్రైవేట్ ఉన్నతపాఠశాల, డిగ్రీ కళాశాల, మార్కెట్‌కమిటీ వగైరాలున్నాయని, ఎప్పుడూ రద్దీగా వుండే ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎంతో ఇబ్బందిగా వుందని ఈ సందర్భంగా మహిళలు అధికారులకు విన్నవించారు. మహిళల రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో, ఆ సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి హుటాహుటిన అక్కడకు చేరి వారితో చర్చించారు. ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుచేయడం వల్ల మీకు కలిగే ఇబ్బందులను మీరు ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయండంటూ ఎస్‌ఐ వారికి సర్దిచెప్పడంతో మహిళలు శాంతించి ధర్నా విరమించారు. అనంతరం, మహిళలంతా కలిసి ఆర్డీఓ, తహశీల్దారు, డిఎస్పీ, ఎక్సైజ్ సి.ఐ, మునిసిపల్ ఛైర్‌పర్సన్‌లకు వినతి పత్రాలు సమర్పించారు. మద్యం దుకాణం తొలగించేందుకు తాము చర్యలు తీసుకుంటామని ఆయా అధికారులు మహిళలకు హామీ ఇచ్చారు. ఈ ఆందోళనలో వీవర్స్ కాలనీ మహిళలతో పాటు వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు చీర్ల బాబు, ఎన్.మధు, రంగనాథ్ పాల్గొన్నారు.

# రోశయ్య జన్మదిన వేడుకలు

తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య 83వ జన్మదిన వేడుకలు ఈ నెల 4వ తేదీ చెన్నై రాజ్‌భవన్ దర్బారుహాలులో జరిగాయి. ఈ సందర్భంగా కె.వి.చలమయ్య గవర్నర్‌ను శాలువతో సత్కరించి జొన్నవాడ కామాక్షమ్మ దేవస్థానం నుండి తెచ్చిన తీర్థప్రసాదాలను అందజేశారు. దేవదాయ ధర్మాదాయ విశ్రాంత ఉపకమిషనర్ ఎన్.యానాదిశెట్టి గవర్నర్‌ను సత్కరించి రాజరాజేశ్వరి అమ్మవారు, చెంగాళమ్మ అమ్మవారుల ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వీసు కమిషన్ సభ్యులు గుబ్బా చంద్రశేఖర్, మానవ హక్కుల ఛైర్మెన్ పెద్దిరెడ్డి, తమిళనాడు మాజీపార్లమెంటు సభ్యులు సి.నరశింహం, నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, శ్రీశైలం దేవస్థానం మాజీఛైర్మెన్ యిమ్మడిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# నూతన కార్యవర్గం

నెల్లూరు నవాబుపేటలోని శ్రీమద్దులూరి వీరరాఘవయ్య నాయిబ్రాహ్మణ కళ్యాణ మండపం కార్యవర్గ సమావేశం ఈ నెల 5వతేదిన జరిగింది. ఈ సమావేశంలో పాత కార్యవర్గాన్ని రద్దు పరచి నూతన కార్యవర్గన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కందుకూరి సుబ్బారావు,ఉపాధ్యక్షులుగా వి.మధుసూదనరావు పి.గోపాలకృష్ణ,పి.మోహన్‌రావు,యం పుల్లయ్య, యం.శ్రీనివాసులు, ఎం.సాయిబాబా, జనరల్ సెక్రటరీగా గురిజాల చంద్రమౌళి, సెక్రటరీగా కందుకూరి వెంకటకృష్ణారావు, జాయింట్ సెక్రటరీలుగా యం.శంకర్, పి.మురళీకృష్ణ, పి.మల్లిఖార్జున, పి.విశ్వనాథ్, ట్రెజరర్‌గా వాడవర్తి గోవర్ధన్ కార్యవర్గ సభ్యులుగా మరో 16 మంది ఎన్నికయ్యారు.

# మూలస్థానేశ్వరుడి హుండీ లెక్కింపు

నెల్లూరు మూలాపేటలోని శ్రీభువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో 4వతేదీ హుండీల లెక్కింపు జరపగా రూ.4.16లక్షలు ఆదాయం లభించింది. ఈ ఏడాది మార్చి 25 నుంచి జూలై 4వ తేది వరకు ఈ రాబడి వచ్చింది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండల మాజీ అధ్యక్షుడు రేబాల వెంకటరెడ్డి, మాజీసభ్యులు భూపతి విజయకుమార్, మురళీ, నారపనేని శ్రీనివాసులు, విజయలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులకు 'సరస్వతి నిధి'

సరస్వతినిధి ద్వారా ప్రతిభావంతులైన 40మంది నిరుపేద విద్యార్థులకు 2015-16 సంవత్సరానికి కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ విద్యను అభ్యసించే అవకాశాన్ని కలుగజేస్తున్నట్లు జిల్లా అడిషనల్ జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ తెలిపారు. బుధవారం నెల్లూరు డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో సరస్వతినిధి ద్వారా కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ ప్రవేశానికి బిసి, ఓసీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీల్లో 116మంది, ఓసీల్లో 44మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరందరికి ఏజేసీ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజేసీ మాట్లాడుతూ సరస్వతినిధికి వచ్చే వడ్డీతో 40మంది విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో విద్యను అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు 20మందిని, మిగిలిన కేటగిరీల వారు 20మందిని ఎంపిక చేస్తామన్నారు.

# మహోన్నత నేతకు మహానివాళి!





తెలుగుజాతి ఏనాటికీ మరచిపోని మహానేత, మాజీముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి 66వ జయంతి ఈ నెల 8వ తేదీ నెల్లూరుజిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బడి, గుడి లేని కాలనీలలో కూడా వై.యస్. విగ్రహం ఉంది. స్థానికంగా ఉండే ప్రజలే ఆ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. నెల్లూరు ట్రంకురోడ్డులోని వై.యస్. విగ్రహానికి నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు పి.రూప్‌కుమార్‌యాదవ్‌తో పాటు కార్పొరేటర్లు, వైకాపా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కరెంట్ ఆఫీసు సెంటర్‌లోని వై.యస్. విగ్రహానికి గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తాటి వెంకటేశ్వర్లు, బొబ్బల శ్రీనివాసయాదవ్, నెల్లూరు మదన్‌మోహన్‌రెడ్డి, సత్తార్, హరికుమార్, సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కరెంట్ ఆఫీసు వద్ద వై.యస్. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతేకాక కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చింది వైయస్సేనని, ఆయన కృషితోనే కాంగ్రెస్ రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, బర్నాబాసు, శివాచారి, వందన రాజేష్ తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో అన్ని మండలాలలో వై.యస్. జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడం, ఆసుపత్రులలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచడం, అనాథ, వృద్ధాశ్రమాలలో అన్నదానం నిర్వహించడం వంటి కార్యక్రమాలు జరిగాయి.





# పార్కుల అభివృద్ధికి కలెక్టర్ గ్రీన్‌సిగ్నల్



ఎట్టకేలకు రెండు పార్కులకు మోక్షం కలిగింది. నెల్లూరు నగరంలో పార్కుల అధ్వాన్న పరిస్థితి గురించి 'లాయర్' వారపత్రిక గతంలో తూర్పారబట్టింది. దిక్కూ మొక్కూ లేకుండా ఆక్రమణలతో కుంచించుకుపోయి, నీళ్లు పోసే నాథుడే లేకుండా ఎండిపోయిన మొక్కలు దర్శనమిస్తూ, సేద తీరేందుకు బెంచీలు లేక, చోర శిఖామణుల చేతివాటంతో పార్కులకుండే గ్రిల్స్ మాయమైన విషయాలను సవివరంగా 'లాయర్' ప్రచురించింది. ఈ దశలో జిల్లా కలెక్టర్ యం.జానకి స్పందించి నెల్లూరులోని చిల్డ్రన్స్‌పార్కు, అయ్యప్ప గుడి వద్ద ఉండే పాత మున్సిపల్ పార్కులను అభివృద్ధి చేయాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం ఈ రెండు పార్కులను కలెక్టర్ సందర్శించారు. చిల్డ్రన్స్‌పార్కులో స్విమ్మింగ్‌ఫూల్‌ను అభివృద్ధి చేయాలని, ఇక్కడ క్యాంటిన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదే విధంగా అయ్యప్ప గుడి వద్ద పార్కును అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కమిషనర్ మూర్తి, ఇంజనీరు సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

# రాజుల సంఘం అధ్యక్షుడుగా 'చందు'



నెల్లూరుజిల్లా ఆర్య క్షత్రియ సంఘం అధ్యక్షుడుగా రంగనాయకులపేటకు చెందిన ఫోటోగ్రాఫర్ నందిగం చందువర్మ ఎన్నికయ్యారు. ఈ నెల 5వ తేదీన పప్పులవీధి సత్రం బడిలో సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు జరుగగా చందువర్మ తన ప్రత్యర్థి వై.శ్రీనివాస వర్మపై 69ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆర్య క్షత్రియులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, వారికి రావాల్సిన కుల ధృవీకరణ పత్రాలు, అర్హులకు ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు తెచ్చేందుకు పోరాడుతానని ఈ సందర్భంగా చందు వర్మ పేర్కొన్నారు.



## పుష్కరాలకు వెళుతూ...

# నగర వీధుల్లో ఊరేగిన శ్రీనివాసుడు

గోదావరి పుష్కరాలకు భక్తులు తరలి రావాలని ఆహ్వానిస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం నుండి శ్రీవారి కల్యాణ రథం ర్యాలీ గురువారం సాయంత్రం నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి చేరుకుంది. తిరుమల ఆలయ ముఖ్య అర్చకుడు డాలర్ శేషాద్రి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ దేవస్థానం నుండి బయలుదేరి నగర వీధుల గుండా కెవిఆర్ పెట్రోల్‌బంకు మీదుగా ట్రంకురోడ్డు, వీఆర్‌సి సెంటర్, ఏసి సెంటర్, సంతపేట మీదుగా రంగనాయకులపేట శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానానికి చేరుకుంది. రంగడి ఆలయంలో పూజలు నిర్వహించి తిరుమల నుండి తెచ్చిన వస్త్రాలను స్వామివారికి సమర్పించింది. అక్కడ నుండి గోదారమ్మ తల్లికి పసుపు, కుంకుమ సారెను అందజేయడానికి రాజమండ్రి బయలుదేరి వెళ్ళింది. దారిపొడవునా భక్తులు భజనలు, కోలాటాలు, సంకీర్తనలతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యం.జానకి, రూరల్, నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా పరిషత్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 6గంటల సమయంలో మాగుంట లే అవుట్ నుండి బయలుదేరి రాత్రి 8.30గంటలకు రంగనాయకుల స్వామి దేవస్థానానికి చేరుకున్న స్వామివారి యాత్రకి ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా సిఐ మాధవ్‌రావు నేతృత్వంలోని పోలీసు సిబ్బంది అత్యంత సమర్థవంతంగా పనిచేసి అందరిచేత శెభాష్ అనిపించుకున్నారు.





# మరో చిరంజీవివి కావొద్దు

## పవన్‌కు సోమిరెడ్డి సలహా



రాజకీయాల్లోకి వచ్చి అటు ఇటు కాకుండా కాంగ్రెస్‌లో కలిసిపోయిన చిరంజీవిలా మారొద్దని పవర్‌స్టార్ పవన్ కల్యాణ్‌కు తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, శాసనమండలి సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సలహా ఇచ్చారు. 9వ తేదీ నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ వ్యక్తిగతంగా మంచోడని, ఆయన వెనుకవున్న శక్తులే అతనిని పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. గతంలో చిరంజీవిని కూడా కొందరు రెచ్చగొట్టి ప్రజారాజ్యం పార్టీని పెట్టించారు. అలా పెట్టించిన వాళ్లే చిరంజీవిని వదిలేసి కాంగ్రెస్‌లో చేరిపోయారు. చివరకు చిరంజీవి తన పార్టీని కాంగ్రెస్‌లో కలిపేసి తాను కూడా ఆ కంపులో మునిగిపోయాడని ఎద్దేవా చేసారు. చెప్పుడు మాటలు విని మీ అన్న చిరంజీవిలా కావద్దని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలోనూ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలోనూ మీకూ బాధ్యత వుందని, కేంద్రంలోని ఎన్డీఏ మన మిత్రపక్షమని, కాబట్టి వారితో మన బాధలు చెప్పుకుని రాష్ట్రానికి కావలిసినవి కలిసికట్టుగా సాధిద్దామని సోమిరెడ్డి పిలుపునిచ్చారు. దర్శకుడు రాంగోపాల్ వర్మ ట్వీట్లపై కూడా సోమిరెడ్డి స్పందించారు. పవన్‌ను జంతువులతో పోల్చడాన్ని ఖండిస్తూ మనం మనుషులుగా పుట్టామని అలాగే జీవిద్దామని, పులివేషాలు, పశువుల అవతారాలు మనకెందుకని చురకంటించారు.

తర్వాత తెలంగాణ సీఎం కేసీఆర్‌పై కూడా ఆయన విరుచుకుపడ్డారు. పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు అడ్డుకుంటున్నాడంటూ మహబూబ్‌నగర్ జిల్లాలో బంద్ పాటించడం దుర్మార్గమన్నారు. అసలు పాలమూరుకు కేంద్రం అనుమతే లేదన్నారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్ట్‌గా పేరు మార్చారని, ఈ ప్రాజెక్ట్ డిజైన్ మార్చడం వల్ల దక్షిణ తెలంగాణ జిల్లాల రైతులు ఆగ్రహంతో ఉన్నారని, ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొడుతున్నారని విమర్శించారు.

ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, అన్నం దయాకర్‌గౌడ్, నూనె మల్లిఖార్జునయాదవ్, ఒట్టూరు సంపత్‌రాజు, కాకర్ల తిరుమల నాయుడు, నాగేంద్రలు పాల్గొన్నారు.

# 'ప్రభా'తం

**భా**రత ప్రధాని నరేంద్రమోడీ ప్రస్తుతం జరుపుతున్న మధ్యఆసియా దేశాల పర్యటన భారత దౌత్యరంగంలో మరో కొత్త అధ్యాయమేనని చెప్పవచ్చు. మధ్య ఆసియా దేశాలతో సహా, రష్యాలోనూ ప్రధాని మోడీ పర్యటిస్తారు. ఈ పర్యటన మొత్తంగా ఎనిమిదిరోజుల పాటు సాగనుంది. సోమవారం ఉజ్బెకిస్తాన్‌కు వెళ్లారు. మంగళవారం కజికిస్తాన్ వెళ్ళారు. అక్కడ నుంచి 8వ తేదీన రష్యా, ఆ తర్వాత తుర్క్‌మెనిస్తాన్, 11వ తేదీన కిర్గిజిస్తాన్, 12న తజకిస్తాన్‌లలో పర్యటించి, అనంతరం రష్యాలోని ఉఫా నగరంలో జరిగే షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో ప్రధాని పాల్గొంటారు. మధ్య ఆసియా దేశాలకు ఒక భారతీయ ప్రధాని ఇంత విస్తృతంగా పర్యటన సాగించడం ఇదే తొలిసారి కావడం ఎంతైనా విశేషం. ఆయా దేశాలతో పలు రంగాల్లో కీలకమైన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రధాని సమాయత్తం కావడంతో ఈ పర్యటనకు ఎనలేని ప్రాధాన్యత వచ్చింది. అయితే, ఎంతోకాలంగా ఈ దేశాలతో మనదేశానికి సౌహార్ద్రపూరితమైన సంబంధాలు వున్నప్పటికీ, అపారమైన చమురు, సహజవాయు నిక్షేపాలతో వుండే ఈ దేశాలతో ఆశించిన సన్నిహిత సంబంధాలు లేకపోవడం మాత్రం ఒక లోటేనని చెప్పక తప్పదు. ఈ విషయంలో మనకంటే చైనా ఒకడుగు ముందుగానే వుంది. రెండేళ్ళ క్రితం చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య ఆసియా దేశాలను సందర్శించి, వాటికి అండగా వుంటామని హామీ ఇవ్వడమే కాక, మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆయా దేశాలకు ఉదారంగా రుణాలిచ్చారు కూడా. అంతేకాదు, ఆయా ప్రాంతాల నుంచి చైనాకు చమురు, సహజవాయు పైప్‌లైన్లు కూడా వున్నాయి. మధ్యఆసియా దేశాలతో స్నేహసంబంధాలు ఏ దేశ అభివృద్ధికైనా ఎంతగానో ఉపకరించేవని తెలిసినప్పటికీ, ఇంతకాలంగా ఆ విషయానికి మన నేతలు అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవడం విచారకరం. ఇప్పుడు ప్రధాని మోడీ పర్యటనతో ఆ లోటు తీరనుంది. తుర్క్‌మెనిస్తాన్ నుంచి మన దేశానికి పైప్‌లైన్‌ల ద్వారా గ్యాస్ సరఫరాను పొందేందుకు మూడేళ్ళ క్రితమే ఒప్పందం జరిగినప్పటికీ అదింకా ఆచరణలోకి రాలేదు. తుర్క్‌మెనిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్-ఇండియా కలిపి 'తాపీ' అనే ప్రాజెక్ట్‌కు రూపకల్పన జరిగింది కూడా. 1680 కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ పైప్‌లైన్ ద్వారా మన దేశంతో పాటు, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్‌లకు సైతం గ్యాస్ సరఫరాకు వీలవుతుంది. అయితే, దాదాపు మూడు దశాబ్దాలపాటు కొనసాగే ఈ ఇంధన సరఫరా వ్యవస్త ఆచరణలోకి రావడం అంత సులభమేమీ కాదు. ఎందుకంటే, ఈ పైప్‌లైన్ ప్రయాణించే పలు ప్రాంతాల్లో ఉగ్రవాద ముప్పు పొంచి వుంది. ఉగ్రవాదుల నుంచి ఈ పైప్‌లైన్‌ను ఎలా రక్షించుకోవాలన్నది పెద్ద సమస్యగా వుంటోంది. ఈ నేపథ్యంలో, ప్రధాని మోడీ పర్యటన ఈ సమస్యలన్నిటినీ పరిష్కరించే దిశగా సాగుతుందని అందరూ నిరీక్షిస్తున్నారు. అంతేకాదు, పుష్కలమైన జలవనరులు, చమురు, సహజవాయు నిక్షేపాలతో వుండే పలు మధ్యఆసియా దేశాలతో గతంలో ఎన్నడూ లేనంతగా భారత్ స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేసేవిధంగా ప్రధాని మోడీ చేస్తున్న ఈ పర్యటన సత్ఫలితాలను ఇస్తుందని కూడా అందరూ ఆశిస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ప్రధాని మోడీ మంగళవారం కజికస్తాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ఉగ్రవాదంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. విలువల బలంతో, మానవత్వంపై వున్న కట్టుబాటుతో ఉగ్రవాదాన్ని అరికట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యఆసియా దేశాలతో భారత్‌కు వున్న స్నేహానుబంధాన్ని ప్రధాని వివరిస్తూ, 'మన ప్రాచీన బంధాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖించడానికి తానిక్కడకు వచ్చా' నని స్పష్టం చేశారు. అంతరిక్షం, సైబర్ భద్రత, ఇంధనం తదితర అనేక రంగాల్లో భాగస్వామ్యం ద్వారా ఇరుదేశాలూ లబ్దిపొందవచ్చని ఆయన సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల సదస్సులో కూడా పాల్గొననున్నారు. ఈ నెల 10వ తేదీన రష్యాలో జరుగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులోనూ మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో పాకిస్తాన్ ప్రధాని నవాజ్ షరీఫ్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లతో కూడా మన ప్రధాని చర్చించవచ్చని భావిస్తున్నారు. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక వాణిజ్య సంబంధాల పటిష్టతను మరింత పెంపొందించుకునే లక్ష్యంతో సాగుతున్న ఈ పర్యటన ఎంతో కీలకం కానుంది. వాణిజ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం, విద్యుత్, రక్షణరంగం వగైరాల్లో సహకారం అందించుకోవడం వంటి అంశాలపై ఆయా దేశాధినేతలతో ప్రధాని మోడీ తగు చర్చలు జరపడం ఎంతైనా శ్రేయోదాయకమే. కాగా, ప్రధాని తన పర్యటనలో తొలుత ఉజ్బెకిస్తాన్‌కు వెళ్ళగా, అక్కడ ఆ దేశ ప్రధాని షవకత్ మిరొమొనోవిచ్ మిర్జియాయెవ్ మోడీకి ఘనస్వాగతం పలికారు. ఆ దేశ అధ్యక్షుడు కరిమోవ్‌తో కూడా ప్రధాని మోడీ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా తాష్కెంట్‌లో వున్న మాజీ ప్రధాని లాల్‌బహుదూర్‌శాస్త్రి విగ్రహానికి మోడీ నివాళులర్పించారు. అనంతరం ఉజ్బెకిస్తాన్‌తో ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. ముఖ్యంగా అణుశక్తి, రక్షణ, వాణిజ్య రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకోవడం ఇరుదేశాల మధ్య సౌహార్ద్రపూరితమైన స్నేహానుబంధానికి దారులు వేసినట్లే అవుతుంది. పొరుగున ఉన్న ప్రాంతాల్లో తీవ్రవాదం, ఉగ్రవాదం బలపడుతున్న నేపథ్యంలో, రక్షణ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లోనూ పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాధినేతలు నిర్ణయించుకోవడం మంచి పరిణామమే. ఇలా..మధ్య ఆసియాదేశాలతో స్నేహ సంబంధాలను పెంపొందించుకుంటూ, ఆర్థిక-ఇంధన తదితర అనేక రంగాల్లో వున్న సమస్యలను పరిష్కరించేందుకు, తద్వారా దేశాభ్యున్నతికి బాటలు వేసేందుకు ప్రధాని మోడీ చూపుతున్న శ్రద్ధ, చొరవ ఎంతైనా హర్షదాయకం. మధ్యఆసియా దేశాల్లో ప్రధాని మోడీ పర్యటన తప్పకుండా సత్ఫలితాలను ఇస్తుందని ఆశించవచ్చు.

## మరో కొత్త అధ్యాయం



ప్రధాని మోడీ మధ్యఆసియా దేశాల పర్యటన ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా దేశాలతో వున్న స్నేహ సంబంధాలను మరింత దృఢతరం చేస్తూ సాగుతున్న ఈ పర్యటనలో ప్రధాని చూపుతున్న శ్రద్ధ, చొరవ ఎంతైనా హర్షదాయకం. చమురు, సహజవాయు నిక్షేపాలు అపారంగా వున్న ఆయా దేశాలతో మంచి సంబంధాలు కొనసాగించడం, తద్వారా దేశాభ్యున్నతికి బాటలు వేయడం ఎంతైనా శుభపరిణామమే. ప్రధాని చేస్తున్న ఈ బృహత్ పర్యటన భారత్ దౌత్యరంగంలో ఒక సరికొత్త అధ్యాయమే అవుతుందని భావించవచ్చు.

## కన్నులపండువగా శ్రీనివాస కల్యాణం

శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ నెల 4న నెల్లూరు నగరంలోని టిటిడి కల్యాణమండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం, ధర్మ ప్రచార మండలి, ధర్మ ప్రచార పరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి, శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. టిటిడి అర్చకులు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో, భక్తజనుల గోవిందనామ స్మరణల మధ్య, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య ఈ వేడుక జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. టిటిడి అన్నమాచార్య ప్రాజెక్ట్‌కు చెందిన హనుమేష్ ఆలపించిన అన్నమాచార్య సంకీర్తనలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

## మనుబోలులో భూముల పరిశీలన

ప్రపంచంలోనే ఐదో పెద్ద కంపెనీ అయిన చైనాకు చెందిన డలియన్ మండా కంపెనీ తన పరిశ్రమను భారతదేశంలో స్థాపించ తలపెట్టింది. ఈ కంపెనీ పలు రకాల వస్తువులను ఉత్పత్తి చేస్తుంది. ఈ పరిశ్రమ నిర్మాణానికి రెండువేల ఎకరాల భూమి అవసరం. ఇందుకోసం ఆ కంపెనీ ప్రతినిధి మాథ్యూఅబార్ట్‌తో ఏపిఐసిసి ఎండి కె.వి.సత్యనారాయణ ఇటీవల మనుబోలు మండలంలోని కట్టువపల్లి గ్రామంలో 912ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. వీళ్లు అంతకుముందు కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో కూడా భూములను పరిశీలించారు. నెల్లూరుజిల్లాలో కృష్ణపట్నం పోర్టు అనువుగా వున్నందువల్ల భూమి కుదిరితే ఆ పరిశ్రమ ఈ మండలంలోనే ఏర్పాటు కావచ్చు.

## నెల్లూరులో జైళ్ల శాఖ శిక్షణ కేంద్రం

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో జైళ్ల శాఖ తొలి శిక్షణా కేంద్రాన్ని నెల్లూరులో ప్రారంభించడం అభినందనీయమని జైళ్ల శాఖ రాయలసీమ, కడప రేంజ్ డిఐజి జయవర్ధన్ అన్నారు. నెల్లూరులోని పాత జైలును జైళ్ల శాఖ సిబ్బంది, అధికారులు శిక్షణ కేంద్రంగా మార్చారు. దీన్ని డిఐజి సోమవారం ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర విభజనతో జైళ్ల శాఖకు చెందిన కార్యాలయాలన్నీ తెలంగాణకు వెళ్ళిపోయాయన్నారు. ఈ క్రమంలో నెల్లూరులో సుమారు అయిదెకరాల స్థలంలో శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కృషి చేసామన్నారు. దాదాపు రూ. 100కోట్లతో దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపామని, ప్రస్తుతానికి రూ. 30లక్షలు మంజూరయ్యాయన్నారు. మూడు నాలుగేళ్లలో పూర్తి స్థాయిలో అన్ని వసతులు కల్పించి రాష్ట్రంలోనే ఉన్నతమైన కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రవికిరణ్, శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ వరప్రసాద్, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు పాల్గొన్నారు.



## పెంచల స్వామికి మంచి ఆదాయం

రాపూరు మండలంలోని పెంచలకోనలో వెలసివున్న ప్రసిద్ధపుణ్యక్షేత్రమైన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సముదాయంలోని మూడు ఆలయాల్లో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈసారి హుండీ రాబడి భారీగానే వచ్చిందని, 57,11,696 రూపాయల రాబడి వచ్చిందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి తెలిపారు. మే 5 నుంచి జులై 6వ తేది వరకు ఇక్కడి మూడు ఆలయాల్లో, అన్నదాన సత్రంలో వున్న హుండీల్లో ఆ మేరకు ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు. హుండీ లెక్కింపును వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీరామమూర్తి, దేవస్థానం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుతో పాటు, టిడిపి నాయకులు నువ్వుల శివరామకృష్ణ, వెంకటేశ్వరరెడ్డి, సోమయ్య తదితరులు పర్యవేక్షించారు.




## ప్రెస్‌క్లబ్‌ను కాపాడండి

కొన్నేళ్ల క్రితం కొందరు పాత్రికేయ మిత్రులు చేసిన కృషితో నెల్లూరు కలెక్టరేట్ ఎదురుగాగల మహబూబ్‌ఖాన్ పార్కులో ప్రెస్‌క్లబ్ ఏర్పడింది. కొంతకాలం బాగానే నడిచింది. ఆ తర్వాత ఇక్కడ కూడా స్వాహారాయుళ్లు పోగయ్యారు. 4ప్రెస్‌మీట్‌లు జరిగితే 2ప్రెస్‌మీట్‌లే వ్రాస్తున్నారు. ప్రెస్‌మీట్‌ల కొచ్చిన డబ్బులను తమ సొంతానికి వాడుకుంటున్నారు. ప్రెస్‌క్లబ్‌లో జమ, ఖర్చులు చూపడం లేదు. లెక్కలు లేవు, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రెస్‌క్లబ్‌కు వెంటనే ఎన్నికలు జరపాలి.

**ఓ జర్నలిస్ట్, నెల్లూరు.**

## అర్హులకే తెల్లకార్డులు

గతంలో రాజకీయ కారణాల వల్ల రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా తెల్ల రేషన్‌కార్డులిచ్చారు. ఈ జారీ విధానం వల్ల అప్పుడు ఉమ్మడి రాష్ట్ర జనాభాను కూడా తెల్లకార్డులు మించిపోయాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయంబర్స్‌మెంట్ వంటివాటి కోసం ధనవంతులు కూడా తెల్లకార్డులు తీసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం తెల్లకార్డుల స్థానే కొత్త కార్డులను మంజూరు చేయాలనుకుంటుంది. ఈ సమయంలో అర్హులకు మాత్రమే సంబంధిత తెల్లకార్డు సమాంతర కార్డులను ఇవ్వాలి. ఇల్లు, వారి ఆస్తులను పరిశీలించి కార్డులు మంజూరు చేయాలి. చాలామంది తెల్లకార్డుదారులు తమకిచ్చే రేషన్ సరుకులను డీలర్లకే అమ్ముకుంటున్నారు. సొంత ఇంటిదార్లకు, పొలాలు, ఆస్తులు, కార్లు వంటి ఆధునిక వసతులున్న వాళ్లకు ఈ కార్డులు ఇవ్వకుండా కొన్ని ప్రామాణికాలు రూపొందించాలి.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## వాస్తవాన్ని కళ్లకు కట్టారు

'ఆంధ్రాకు నాయకుడు కావాలి' అంటూ తేది 03.07.15 సంచికలో మీరు వ్రాసింది అక్షరాలా నిజం. ప్రాంతీయ వాదం కన్నా జాతీయవాదం గొప్పది. అయితే తమిళనాడు, ఒరిస్సా, మహారాష్ట్ర, ఆఖరుకు ఈరోజు తెలంగాణ వంటి రాష్ట్రాలు కూడా ప్రాంతీయ వాదంతోనే అభివృద్ధి చెందుతున్నాయి. చంద్రబాబు, జగన్‌లిద్దరు కూడా హైదరాబాద్‌లో తమకున్న ఆస్తులు, వ్యాపార వ్యవహారాల దృష్ట్యా పూర్తిగా ఆంధ్రా ప్రయోజనాల కోసం పోరాడలేకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకైతే హైదరాబాద్ పిచ్చి పోలేదు. ఆయన విజయవాడలో అద్దె ఇల్లు తీసుకుని హైదరాబాద్‌లో సొంత ఇళ్లు కట్టుకోవడం చూస్తుంటేనే ఇది అర్ధమవుతుంది. మీరు వ్రాసినట్లు ఆంధ్రా ప్రయోజనాలను కాపాడేందుకు, ఇక్కడ అభివృద్ధిపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ఇప్పుడున్న పార్టీలు కాకుండా ఒక కొత్త రాజకీయ వేదిక కావాలి.


**పైడిమర్రి జీవన్‌శేఖర్, నెల్లూరు.**

# సహకార బ్యాంకును మెరుగుపరుస్తున్నాం

## - డిసిసిబి ఛైర్మెన్



జిల్లా కేంద్ర సహకార బ్యాంకును ఆర్థికంగా శక్తివంతం చేయడంతో పాటు బ్యాంకు ద్వారా రైతులకు సేవలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నా మని ఆ బ్యాంకు ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి వెల్లడించారు. ఇటీవల నెల్లూరులోని బ్యాంకు కార్యాలయంలో సహకార బ్యాంకుల మేనేజర్లు, సిఇఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, బ్యాంకు అభివృద్ధికి కృషి చేస్తున్న సిఇఓలకు ప్రత్యేక ఇంక్రిమెంట్లు ఇస్తామని చెప్పారు. సొసైటీలలో మౌలిక వసతుల కల్పనకు 1.5కోట్లు సిడిఎఫ్ నిధులు మంజూరయ్యాయని, ఈ నిధుల ఖర్చుకు ప్రత్యేక కమిటీని వేస్తున్నట్లు తెలిపారు. ఆయా బ్యాంకులను, సొసైటీలను ఈ కమిటీ పరిశీలిస్తుందని, కమిటీ సిఫారసు చేసిన వారికి అవసరమైన ఫర్నీచర్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. సిబ్బంది ఋణాల వసూళ్లతో పాటు డిపాజిట్ల సేకరణ మీద కూడా దృష్టి పెట్టాలని ఆయన కోరారు. రైతులు తీసుకున్న వివిధ రకాల పంట ఋణాలను రెన్యువల్ చేయాలని ఆయన సూచించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఇబ్బందులకు గురికాకుండా సకాలంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ప్రతి పంటకు ఋణ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకు ఉపాధ్యక్షులు నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డిజిఎంలు ఉషారాణి, సరిత, ఏజిఎం నాగేంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.



## సర్కారీ సరుకు

# తాగరబాబు... తాగి ఊగరబాబు

***ప్రజల చెంతకు పాలన తీసుకెళ్లాలని మహానుభావుడు ఎన్టీఆర్ పిలుపునిచ్చి ఆ పని చేసి చూపాడు కూడా! ప్రజల చెంతకే పాలన, పథకాలు, పాలకులను తీసుకువెళ్లిన ఘనత ఆయనది. ఇప్పుడు ప్రజల చెంతకే ప్రభుత్వ మద్యాన్ని తీసుకెళ్లడం ద్వారా చంద్రబాబు సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టారు.***

కొత్త ఎక్సైజ్ పాలసీ ద్వారా మద్యం అమ్మకాలలోకి ఈ సంవత్సరం నుండి ప్రభుత్వం ప్రవేశించింది. జిల్లాలో 348దుకాణాలకు గాను 36మద్యం దుకాణాలను ప్రభుత్వం ఆధ్వర్యంలోనే నడపాలని నిర్ణయించడం జరిగింది. ఈమేరకు ఈ నెల 3వ తేదీ నుండి ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో సర్కార్ మద్యం దుకాణాలు తెరచుకున్నాయి. నెల్లూరులో కనకమహల్ సెంటర్, ములుమూడి బస్టాండ్ వంటి చోట్ల ఎక్సైజ్ అధికారులు, సిబ్బందే మద్యం అమ్మకాలు నిర్వహించారు. సర్కార్ దుకాణాల వద్ద 'ఎమ్మార్పీ ధరలకే మద్యం' అంటూ బోర్డులు పెట్టడంతో మందుబాబులు ఎగబడసాగారు. అయితే అక్కడే కూర్చుని తాగే వసతి లేకపోవడంతో కొందరు మాత్రం నిరాశతో వెళ్తున్నారు. సర్కారీ షాపుల్లో మద్యం అమ్మకాలను పెంచడానికి ఎక్సైజ్ సిబ్బంది తెగ తంటాలు పడుతున్నారు.

## 'నుడా' సీటుపై...

# నారాయణ వరం ఎవరికో!





***నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) ఏర్పాటు దాదాపు ఖాయమైపోయి నట్లుగా తెలుస్తోంది. దాదాపు సంవత్సరం నుండి దీని మీద కసరత్తు జరుగుతోంది. గత కమిషనర్ చక్రధర్‌బాబు దీనిని ఓ కొలిక్కి తెచ్చారు. నెల్లూరు అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీని కేవలం నెల్లూరు నగరానికే పరిమితం చేయకుండా జిల్లాలోని అన్ని మున్సిపాల్టీలను, దాదాపు 36 మండలాలను దీనిలో కలపాలని ప్రతిపాదిం చారు. దీంతో 'నుడా' ఛైర్మెన్ పదవికి ఇప్పుడు పోటీ పెరిగిపోయింది.***





పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా జిల్లాకు చెందిన నారాయణ ఉన్నారు. కాబట్టి 'నుడా' ఛైర్మెన్ ఎవరైనా ఆయన ఆశీస్సులతో రావాల్సిందే! అయితే ఇక్కడ కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఆమోదం కూడా తప్పనిసరి అవుతుంది. ఆయన ఈ జిల్లావాసే కాబట్టి 'నుడా' ఛైర్మెన్ ఎంపికలో ఆయన అభిప్రాయం కూడా ముఖ్యమే. ఎందుకంటే నెల్లూరు నగరాభివృద్ధికి ఆయన ఆశీస్సులు ఎంతో అవసరం.

వెంకయ్య, నారాయణల ఆదరణ పొందిన నాయకులెవరన్నది ఇప్పుడు ప్రశ్నార్థకం. 'నుడా' ఛైర్మెన్ రేసులో పలువురు నాయకులు చాలారోజుల నుండి ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో మహిళల నుండి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనూరాధ పేరు వినిపిస్తుండగా, ఇక మగోళ్ల వైపు నుండి డాక్టర్ జడ్.శివప్రసాద్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతరావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిల పేర్లు వున్నాయి. వీరిలో దేశాయిశెట్టికి వివాదరహితుడనే పేరుంది. కాని ఆయనకిస్తే సొంత సామాజికవర్గం కాబట్టి కులాభిమానం చూపాడనే మరక నారాయణ మీద పడుతుంది. అనూరాధ పట్ల మంత్రికి సానుకూల అభిప్రాయమే వుంది. అయితే మంత్రి ఇవ్వాలనుకున్నా జిల్లాలో మిగతా పెద్దనాయకులు ప్రతిఘటించే అవకాశముంది. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చూస్తే 'రెబల్‌స్టార్'. కాబట్టి నారాయణ సానుకూలంగా ఆలోచించకపోవచ్చు. కాకపోతే బాలకృష్ణ గట్టిగా పట్టుబడితే కోటంరెడ్డి శీనయ్యకు అదృష్టం పట్టొచ్చు. ఈమధ్యకాలంలో మున్సిపల్ ఎన్నికల్లో దిగి ఆర్థికంగా నష్టపోయింది డాక్టర్ జడ్.శివప్రసాద్. పార్టీలో పాతోడే! కాకపోతే నెత్తిన సోమిరెడ్డి బ్రాండ్ వుంది. అయినా ఎవరికీ శత్రువు కాదు. అందరితో సన్నిహితంగా ఉంటున్నాడు. అటు సోమిరెడ్డితోనూ, ఇటు మంత్రితోనూ వారిని అనుసరించి పోతున్నాడు. బిసి కావడం కొంత కలిసొచ్చే అంశం. 'నుడా' ఏర్పాటు త్వరలోనే జరగబోతోంది. ఈమేరకు సచివాలయంలో ఫైలు కూడా సిద్ధమైనట్లు తెలుస్తోంది. 'నుడా' ఏర్పాటు తర్వాత 'ఛైర్మెన్' రేసు మొదలుకానుంది.

# టీచర్ జానకి



కలెక్టరమ్మ కాసేపు టీచరమ్మగా మారింది. చదువుకోవడం లోనే కాదు, చదువు చెప్పడంలో వున్న గొప్పతనాన్ని ఆస్వా దించింది. ఎలిమెంటరీ స్కూల్, హైస్కూల్స్‌లో చదివేటప్పుడు సాధారణంగా అందరికీ అనిపిస్తుంటుంది... మనం కూడా టీచర్ అయితే బాగుంటుందని, కాని అందరూ టీచర్‌లు కాలేరుగా. కానీ ఒక్కరోజు సీఎంలాగా ఒక్కరోజైనా టీచర్‌గా పనిచేసే అవకాశం కొందరికి వస్తుంటుంది. అలా వచ్చిన అవకాశాన్ని మన జిల్లా కలెక్టర్ జానకమ్మ ఉపయోగించుకుంది. ఇటీవల ఆమె ఉదయగిరికి వెళ్లారు. బిసి కాలనీలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పారు. కలెక్టరే తమ టీచర్‌గా రావడంతో అక్కడి విద్యార్థులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. కలెక్టర్ కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించి, ఉపాధ్యాయులతో మాట్లాడి అక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని చెప్పారు.

# ఏడాదిలో ఏం పొడిచారు!



***నిన్న మొన్న జరిగినట్లుగా వున్నాయి... ఆనాడు జరిగిన సంఘటనలన్నీ కళ్ల ముందే ఇంకా కదులుతున్నాయి... నగరపాలక సంస్థ ఎన్నికలు... వైకాపాకు మెజార్టీ డివిజన్‌లు... ఆ తర్వాత తెలుగుదేశం అధికారంలోకి రావడం... వైకాపా కార్పొరేటర్లతో ఊటీ, బెంగుళూరులలో క్యాంపులు పెట్టడం, మేయర్‌గా అజీజ్ ఎన్నిక... ఆ తర్వాత ఆయన తెలుగుదేశంపార్టీలో చేరడం... అయితే ఇవన్నీ జరిగి అప్పుడే ఏడాదైంది. కాలం గిర్రున తిరిగిపోయింది. కానీ మున్సిపల్ ఎన్నికల్లో చేసిన అప్పుల నుండి ఇంకా చాలామంది నాయకులు బయటపడలేదు.***

ఇక ఏడాదిపాలనలో కొత్త పాలకవర్గం ఏం పొడిచిందనేదానికి సమాధానమే లభించింది. ఎప్పటి కప్పుడు కొత్తగా వస్తున్న పాలకవర్గాలు పాతవారినే మంచి అనిపిస్తున్నాయి. అంటే ఎప్పటికప్పుడు నగరపాలకసంస్థ పనితీరు దిగజారుతూ వస్తోంది. కొత్త పాలకవర్గం ఈ ఏడాదిలో ఇరగదీసిన పనులేమీ లేవు. ఈ సంవత్సరంలోనే ముగ్గురు కమిషనర్లు మారి నాలుగో కమిషనర్ వచ్చారు. గతంలో ఆరు నెలలకో కమిషనర్ వస్తారనే పేరుండేది. ఇప్పుడు నెలకు ఇద్దరు కమిషనర్లు లెక్కన అయ్యారు. గత కౌన్సిల్ కాలంలో నగరంలో డ్రైన్లు, రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణం వంటి పనులు జరిగాయి. తాగునీటి ఎద్దడిని అరికట్టారు. గత కౌన్సిల్‌లోనూ అవినీతి ఆరోపణలు, అక్రమాలు, సమస్యలు వున్నా పనులు జరిగాయి. కానీ, ఈ ఏడాది కాలంలో నగరంలో పనులే లేవు. కాకపోతే ఆస్తి పన్నులు మాత్రం భారీగా పెంచారు. కొత్త రోడ్లు, కొత్త కాలువలు, కొత్త పైప్‌లైన్ల పనులు లేవు. నగర సందుల్లో పందులు, కోతులు, కుక్కలు తమ సంతతిని పెంచుకుంటూ మనుషుల కంటే అవే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రజలు వీటి బారిన పడుతున్నా పాలకులకు వాటి గురించి పట్టడం లేదు. పారిశుద్ధ్యం విషయంలో మాత్రం కొంత ఫర్వాలేదనిపిస్తున్నారు.

నగరంలో భూగర్భడ్రైనేజీకి, మంచినీటి పథకాలకు వెయ్యి కోట్లు హడ్కో ఋణం మంజూరైంది. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు దీనికి కృషి చేసారు. అయితే ఇది తిరిగి చెల్లించాల్సిన ఋణం. కార్పొరేషన్ ఆదాయమే అంతంత మాత్రంగా వుంది. ఈ నిధులు వాడుకుంటే హడ్కోకు ఏడాదికి వందకోట్లకు పైగా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. కార్పొరే షన్‌కు ఇందులో పావు భాగం ఆదాయం లేదు. హడ్కో ఋణం చెల్లించడానికి తిరిగి పన్నుల రూపంలో మమ్మల్ని బాదుతారేమోనని నగర జనం భయపడుతున్నారు. నగర పాలక సంస్థ కొత్త పాలకవర్గం తమ పనితీరుకు ఇంకా పదును పెట్టాల్సి వుంది. కనీసం ఉన్న సిబ్బందితోనైనా పనులు చేయిస్తే కొన్ని సమస్యలన్నా సర్దుబాటవుతాయి.


ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

ఎంసెట్ సెకండ్ కౌన్సిలింగ్‌లో ఇంజనీరింగ్‌లో చేరబోయే విద్యార్థులకు అద్భుత అవకాశం!
జిల్లాలో ఇంజనీరింగ్ విద్యలో తిరుగులేని ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థ
ఆదిశంకర
యాజమాన్యం ఆధ్వర్యంలో
బాలాజి
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ & మేనేజ్‌మెంట్ స్టడీస్(క్యాంపస్)
నెల్లూరుకు అత్యంత చేరువలోకి వచ్చేసింది....
BALAJI INSTITUTE OF ENGINEERING AND MANAGEMENT STUDIES
BEAM
IS MERGED INTO
AUDISANKARA GROUP OF INSTITUTIONS NELLORE
92487 48 405, 92487 48 404, 8688 222 444, 7306 222 444
EAMCET WEB COUNSELLING CODE : BEAM



# ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు నగరం నవాబుపేట నజీర్‌తోటలో వున్న బిబామియా మజీద్‌లో మంగళవారం నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌లు పాల్గొని ప్రత్యేక దువా నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఈ మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అల్లా దయవల్ల అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ డి.సిగా శ్రీనివాసరావు



నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా టి. శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు భక్తవత్సలనగర్‌లో వున్న డీసీ కార్యాలయంలో ఆయన ఆ మేరకు బాధ్యతలు స్వీకరించి, అధికారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ మద్యం విధానాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని, ఎమ్మార్పీ ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మద్యం బెల్టుషాపులను, సారా విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఆయన సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జానకిని గౌరవపూర్వకంగా కలిసి మాట్లాడారు. కాగా, నూతన డీసీగా విచ్చేసిన శ్రీనివాసరావుకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

### భాను నెల్లూరొచ్చాడు...

# టిటిడిని సందర్శించాడు




తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టుబోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి సోమవారం నెల్లూరుకొచ్చాడు. ఈ సందర్భంగా ఆయన దర్గామిట్టలోని టిటిడి కళ్యాణ మండపాన్ని సందర్శించాడు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న స్వామివారి ఆలయానికి సంబంధించిన వివరాలను టిటిడి సిబ్బందిని అడిగి కనుక్కున్నాడు.

టిటిడి కళ్యాణ మండపాన్ని కూడా ఆధునీకరించాలనే విజ్ఞప్తి నెల్లూరీయుల నుండి వినిపిస్తున్న తరుణంలో ప్రస్తుతం వున్న కళ్యాణ మండప స్థితిగతులను కూడా భాను పరిశీలించాడు.

"స్వచ్ఛభారత్" స్ఫూర్తితో మండపం ప్రాంగణాన్ని పరిశుభ్రంగా వుంచాలని కూడా సిబ్బందిని ఆయన కోరాడు. స్వామివారి భక్తుల మనోభావాలను అర్ధం చేసుకుని వారి కోరికలను తీర్చడమే ట్రస్టు సభ్యుడిగా తన బాధ్యతని, ఇక్కడి ఆలయ నిర్మాణంతో పాటు కళ్యాణ మండపాన్ని పునఃనిర్మించే విషయాన్ని కూడా బోర్డు దృష్టికి తీసుకువెళ్ళి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడిగారి సహకారంతో స్వామివారి ఆశీస్సులతో భక్తుల సేవ చేస్తానని తెలిపాడు.

భానుతో పాటు ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, టిటిడి సిబ్బంది, ధర్మప్రచార మండలి సభ్యులు పాల్గొన్నారు.



### ఏపి ఆర్యవైశ్య మహాసభ

## ముఖ్య సలహాదారుగా కె.వి.చలమయ్య

ఏపి ఆర్యవైశ్య మహాసభ ముఖ్య సలహాదారుగా కె.వి. చలమయ్య నియమితులయ్యారు. ఈమేరకు మహాసభ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ తాను గతంలో అందించిన సేవలను గుర్తించి ఈ పదవిని అప్పగించినందుకు గవర్నర్ రోశయ్య, అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### ట్రైనీ కలెక్టర్‌గా

## సిక్తాపట్నాయక్



నెల్లూరుకు ట్రైనీ కలెక్టర్‌గా సిక్తాపట్నాయక్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆమె 4వ తేదీ జిల్లా కలెక్టర్ ఎం.జానకి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌లను కలిసారు. ట్రైనీ కలెక్టర్ ఆరు నెలలపాటు జిల్లాలో ఉండి తహశీల్దార్ ఎంపీడీఓ తదితర హోదాల్లో శిక్షణ పొందుతారు.

## అడిషనల్ కమిషనర్ బదిలీ?

నెల్లూరు నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి బదిలీ కానున్నట్లు సమాచారం. ప్రభుత్వం ఈయన్ను కడప కమిషనర్‌గా బదిలీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఈయన గతంలో అనంతపురం మునిసిపల్ కమిషనర్‌గా పని చేసారు. ప్రస్తుతం గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు గాను రాజమండ్రిలో వుంటూ అక్కడే విధులు నిర్వహిస్తున్నారు.

## జొన్నాకు ఎఫ్‌సిఐ

నెల్లూరుకు చెందిన జొన్నా సత్యనారాయణ భారత ఆహార సంస్థ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్‌కు, సిఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## పుష్కరాలకు బస్సులు

గోదావరి పుష్కరాలకు నెల్లూరు ఆర్టీసీ రీజియన్ జిల్లాలోని అన్ని డిపోల నుండి ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. భక్తులు కోరితే అద్దె ప్రాతిపదికన కూడా బస్సులను నడిపేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. నెల్లూరు నుండి బయలుదేరే ఈ బస్సులు కొవ్వూరు లేదా రాజమండ్రిలలో ఆగుతాయి. సూపర్‌లగ్జరీ బస్సులో 750రూపాయలు, ఎక్స్‌ప్రెస్‌లో 570రూపాయలు ఛార్జీగా నిర్ణయించారు.

## 'కేరింత' హల్‌చల్



నెల్లూరులోని ఎస్2 థియేటర్‌లో 'కేరింత' చిత్రం విజయోత్సవాన్ని పురస్కరించుకుని చిత్ర యూనిట్ 4వ తేదీ హల్‌చల్ చేసింది. స్క్రీన్ 3లో చిత్రం చూస్తున్న ప్రేక్షకుల మధ్యకు నిర్మాత దిల్‌రాజు తన చిత్ర బృందాన్ని వెంట తీసుకొచ్చారు. చిత్రయూనిట్‌పై అభిమానులు పూలజల్లులు కురిపించి బాణాసంచాను కాల్చారు. అనంతరం చిత్ర హీరో సుమంత్ అశ్విన్, హీరోయిన్లు శ్రీదివ్య, శుక్రుతిలు చిత్రంలోని డైలాగ్‌లు చెబుతూ పాటలు పాడుతూ యువతను ఉర్రూతలూగించారు. చిత్ర యూనిట్ అందరూ కలిసి చిత్రంలోని పాటలకు డాన్స్‌లేసి ప్రేక్షకులను అలరించారు. విజయోత్సవాన్ని అందించిన ప్రేక్షకులకు దిల్‌రాజు అభినందనలు తెలిపారు. నూకరాజు పాత్రతో గుర్తింపు తెచ్చుకున్న విశ్వంత్ శ్రీకాకుళం యాసతో మాట్లాడుతూ ప్రేక్షకులను ఆనంద పరిచాడు. చిత్ర దర్శకుడు సాయికిరణ్ అడివి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు



## మాగుంట గెలుపుపై హర్షం

ప్రకాశం జిల్లా స్థానిక సంస్థల శాసనమండలి నియోజకవర్గం నుండి మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంపై నెల్లూరులో మాగుంట అభిమానులు, తెలుగుదేశం కార్యకర్తలు ఆనందోత్సాహాలతో ఉన్నారు. ఈ నెల 3వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నిక జరిగింది. వైసిపి ఆ ఎన్నికలను బాయ్‌కాట్ చేయడంతో ఆరోజే ఆయన గెలుపు లాంఛనమని తేలిపోయింది. 7వ తేదీ అధికారికంగా కౌంటింగ్ నిర్వహించి ఆయనను ఎమ్మెల్సీగా ప్రకటించారు.

## ప్రతిభకు ప్రోత్సాహం



మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన నెల్లూరు ఏ.సి నగర్ లోని మల్లెల సంజీవయ్య మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో పదో తరగతి చదివి ఉత్తమ ఫలితాలను సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతు లందజేశారు. 9.8గ్రేడ్ సాధించిన విద్యార్థికి 2116రూపాయలు, 9.5గ్రేడ్ సాధించిన వారికి 1516 రూపాయలు, 9.2గ్రేడ్ సాధించిన విద్యార్థికి 1116 రూపాయలు నగదు బహుమతులందజేశారు. అలాగే హెడ్మాస్టర్ జయలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో శరత్‌చంద్రారెడ్డి మిత్రులు నిషాంత్, రహీం, చందు, సెల్వ, అభి తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యం

—గ్లోబల్ హెల్త్‌సిటీ ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి

అన్ని రకాల జబ్బులకు తగు చికిత్సను అందిస్తూ గ్లోబల్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యం అందిస్తున్నారని, చెన్నైలోని ఆసుపత్రిలో ఈ అత్యాధునిక వైద్యం అందుబాటులో వుందని గ్లోబల్ హెల్త్ సిటీ ఉపాధ్యక్షులు భాస్కరరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. గుండె మార్పిడి, లివర్ క్యాన్సర్, ప్రాంక్రియాస్ క్యాన్సర్, లివర్ మార్పిడి తదితరాలన్నిటికీ గ్లోబల్ ఆసుపత్రిలో అత్యాధునిక విధానంలో వైద్యం అందిస్తున్నారని, పుట్టుకతోనే గుండెకు రంధ్రాలు ఏర్పడిన వారికి ఆపరేషన్ లేకుండా డివైజ్ క్లోజర్ విధానంతో నయం చేస్తారని తెలిపారు. గుండె సంబంధిత వ్యాధులకు ప్రస్తుతం బైపాస్‌సర్జరీ చేస్తుంటారని, ఈ ఆపరేషన్ వల్ల రోగికి కనీసం ఆరు నెల దాకా విశ్రాంతి అవసరం వుంటుందని, అయితే గ్లోబల్ ఆసుపత్రిలో ఇండోస్కోపింగ్ విధానంలో రిబ్స్‌ను వెడల్పు చేసి మిషనరీతో సర్జరీ చేస్తారని, ఇందువల్ల కేవలం నాలుగు రోజులకే రోగి డిశ్చార్జ్ అయ్యే వెసులుబాటు వుంటుందని ఆయన తెలిపారు.

## వేదవ్యాసలో అల్లూరి జయంతి



అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఈనెల 4వ తేది నెల్లూరు మాగుంట లే అవుట్‌లో వున్న వేదవ్యాస స్కూలులో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసారు. అల్లూరి జీవిత విశేషాలను గురించి స్కూల్ కరస్పాండెంట్ ఎపి బాలాజి విద్యార్థులకు వివరించారు. అల్లూరి సీతారామరాజు త్యాగాన్ని, దేశభక్తిని విద్యార్థులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ ఎపి వేదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్‌ఐల బదిలీ

జిల్లాలో మొన్న కొంతమంది ఎస్‌ఐల బదిలీలు జరిగాయి. నెల్లక్రితమే నెల్లూరు నాలుగో నగరం నుండి రాపూరుకు వేసిన టి.గిరిబాబును అంతలోపే పొదలకూరుకు మార్చారు. విఆర్‌లో వున్న సి.హెచ్.కోటిరెడ్డిని ఇందుకూరుపేటకు, వింజమూరులో వున్న కె.ఏడుకొండలను సైదాపురంకు, వెంకటగిరిలో వున్న కె.వేణుగోపాల్‌ను వింజమూరుకు, విఆర్‌లో వున్న ఎస్.కె.సుభానిని చేజర్లకు, ఎస్.కె.ఖలీల్ అహ్మద్‌ను పిసిఆర్ సెల్‌కు బదిలీ చేశారు. రెండో ట్రిప్పులో దుగరాజపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.వెంకటరావును విడవలూరుకు, విడవలూరు ఎస్సై సిహెచ్ బలరామయ్యను సౌత్ ట్రాఫిక్‌కు, సౌత్ ట్రాఫిక్ ఎస్సై పి.శ్రీనివాసరెడ్డిని ముత్తుకూరుకు, ముత్తుకూరు ఎస్సై కె.మారుతికృష్ణను డిఎస్‌బికి బదిలీ చేసారు. ఈ నెల 3వ తేది రాత్రి విఆర్‌లో ఉన్న ఎం.అంజిరెడ్డిని వెంకటగిరి ఎస్సైగా నియమించి అనంతరం ఈయన పోస్టింగ్‌ను రద్దుచేసి మరలా విఆర్‌లోనే ఉండాలని ఎస్పీ ఆదేశాలు జారీచేసారు.





## సంగీత కీర్తి...

# సాంబమూర్తి విగ్రహానికి భూమిపూజ

తెలుగువారికి త్యాగరాజ కీర్తనలను పరిచయం చేసి, నెల్లూరును దక్షిణ భారతదేశంలో మరో తిరువాయూర్‌గా నిలిపిన భిక్షాటనా పూర్వక శ్రీ త్యాగరాజస్వామి స్మరణోత్సవ సభ స్థాపకులు, ప్రపంచాన్నే ఉర్రూతలూగిస్తున్న మధుర గాయకుడు, పద్మభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం తండ్రిగారైన శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఈ నెల 3వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వేంకటేశ్వర కస్తూరిబా కళాక్షేత్రం ప్రాంగణంలో భూమిపూజ నిర్వహించారు. సాంబమూర్తి సతీమణి శ్రీమతి శకుంతలమ్మ ఈ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని తన భర్త స్మృతులను నెమరువేసుకున్నారు. భిక్షాటనా పూర్వక త్యాగరాజస్వామి స్మరణోత్సవ సభ స్థాపకులు శ్రీ పండితారాధ్యుల సాంబమూర్తి విగ్రహ స్థాపన కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.



కమిటీ అధ్యక్షులు గ్రోసు గోపాలయ్య, ఉపాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, ముఖ్య సమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి, సభ్యులు కనుపూరు శ్రీనివాసులురెడ్డి, దందమూడి హేమంత్‌కుమార్, యనమండ్ర నాగదేవీ ప్రసాద్, వీరిశెట్టి శ్రీనివాసరావు, టి.వి.యస్.చలపతి రావులతో పాటు నగర ప్రముఖులు, సంగీత సాహిత్య అభిమానులు ఈ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని పండితారాధ్యుల కుటుంబం పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అమెరికా నుండి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం తన సందేశాన్ని వినిపిస్తూ ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయినందుకు బాధను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# నిర్లక్ష్యం వీడండి



పనులను సకాలంలో పూర్తి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, జిల్లా పరిషత్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కేటాయించిన పనులు అగ్రిమెంట్ కాకపోయినా, ప్రారంభించకపోయినా రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. 4వతేదీ జడ్పీ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్, పిఆర్ అధికారులు, ఏఈలు, డిఇలతో పనుల ప్రగతిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకచర్యలు తీసుకున్నామని, కేంద్రం నుంచి రూ.200కోట్లు గ్రాంట్ మంజూరైతే ప్రతి నియోజకవర్గంలో ఇంటర్నల్ రోడ్లను అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మంచినీటి సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జడ్పీ సిఇఒ చంద్రమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఇ రామిరెడ్డి, పిఆర్ అధికారులు, ఏఈలు, ఈఇలు పాల్గొన్నారు.

# సబ్సిడీ రుణాలను వేగవంతం చేయండి

**- జిల్లా కలెక్టర్ ఎం.జానకి**



ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు ఇచ్చే సబ్సిడీ రుణాలను మంజూరు చేసేందుకు సత్వర చర్యలు తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎం.జానకి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ తన ఛేంబర్‌లో పలు శాఖల అధికారులు, బ్యాంకర్లతో సమావేశమయ్యారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, పెండింగ్‌లో వున్న సబ్సిడీ రుణాలను త్వరగా మంజూరుచేయాలని, ఆ మేరకు ఈ నెల 14వ తేదీలోపు ఎంపిడిఓలు ఆ లబ్దిదారుల జాబితాలను సిద్ధం చేసి రుణాలు మంజూరు చెయ్యాలన్నారు. అదే విధంగా, మంజూరైన యూనిట్లు గ్రౌండింగ్ అయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని, 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను కూడా పూర్తిచేయాలని ఆదేశించారు. ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీల అభ్యున్నతికి ప్రత్యేక రుణాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఏ పి.డి చంద్రమౌళి, ఐటిడిఏ పి.ఓ వెంకటేశ్వర్లు, బిసి కార్పొరేషన్ ఇ.డి కోటేశ్వరరావుతో పాటు బ్యాంక్ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

# కేతిరెడ్డికి అమెరికా యూనివర్శిటీ డాక్టరేట్



చలనచిత్ర నిర్మాత మరియు దర్శకుడు, తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు మరియు నెల్లూరీయుడైన కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డికి డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు అమెరికాకు చెందిన కింగ్స్ విశ్వవిద్యాలయం ప్రకటించింది. కేతిరెడ్డి చిత్ర పరిశ్రమలో అన్ని భాష లలో దాదాపు 20చిత్రాల వరకు నిర్మించారు. ఆయన అగ్ని అనే చిత్రానికి దర్శకత్వం కూడా వహించారు. దాదాపు 30సంవత్సరాలుగా చలనచిత్ర పరిశ్రమలో ఒక సాంకేతిక నిపుణుడిగా, నిర్మాతగా కొనసాగుతున్నారు. అంతేకాకుండా తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడిగా తమిళనాడులో నివసించే తెలుగుప్రజల సమస్యల పరిష్కారం కొరకు పోరాటాలు చేసారు. తమిళ ఉగ్రవాద సంస్థకు చెందిన కొంతమంది వ్యక్తులు ఇటీవల నటుడు శోభన్‌బాబు విగ్రహాన్ని కూల్చాలని ప్రయత్నించగా కేతిరెడ్డి అడ్డుకున్నాడు. అదే విధంగా శ్రీకృష్ణ దేవరాయులను కించపరుస్తూ వడివేలు నటించిన చిత్రంలో కొన్ని సంఘటనలు తెలుగువారి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, ఆ సన్నివేశాలను తొలగించాలని ఉద్యమాలు చేపట్టారు. తమిళనాట తెలుగు భాషను అంతరింపచేసేందుకు ప్రయత్నిస్తున్న అక్కడి ప్రభుత్వాన్ని ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటున్నారు. సాంఘిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్న కేతిరెడ్డిని గుర్తించి కింగ్స్ విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. ప్రతిష్ఠాత్మక 'కింగ్స్' డాక్టరేట్‌ను అందుకుంటున్న తమిళనాట తెలుగు కింగ్ కేతిరెడ్డికి 'లాయర్' అభినందనలు.

# శ్రీసిటీలో 'యూనిఛాం' పరిశ్రమ






భారత దేశంలో మరో నోయిడాగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక మండలి నెల్లూరుజిల్లా తడ మండలం సమీపంలోని శ్రీసిటీ. ప్రపంచంలోని అగ్ర కంపెనీలన్నీ ఇప్పటికే తమ పరిశ్రమలను ఇక్కడ నెలకొల్పాయి. ఈ కంపెనీలు రావడంలో ఆ సంస్థ ఎం.డి రవి సన్నారెడ్డి కృషి మరువలేనిది. ఈ పరంపరలో వచ్చిందే ప్రతిష్ఠాత్మక యూనిఛాం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్.

శ్రీసిటీలో జపాన్‌కు చెందిన యూనిఛాం ఇండియా పరిశ్రమను చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ సీజీ బాబా మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎంతో వేడుకగా జరిగిన ఈ కార్యక్రమంలో యూనిఛాం కార్పొరేషన్ ప్రెసిడెంట్ మరియు సిఇఒ టకాహిసా టకాహరా, మేనేజింగ్ డైరెక్టర్ కిమురా తదితరులు పాల్గొన్నారు. జపాన్‌లోని యూనిఛాం కార్పొరేషన్‌కు పూర్తి స్థాయి అనుబంధ పరిశ్రమ అయిన యూనిఛాం ఇండియా తన రెండవ యూనిట్‌ను ఇక్కడ ప్రారంభించింది. 2008లో తన మొదటి యూనిట్ రాజస్థాన్‌లో నెలకొల్పింది. శ్రీసిటీలో 40ఎకరాల్లో ఏర్పాటైన ఈ పరిశ్రమ ద్వారా మొదటిదశలో 400 మందికి, మలిదశలో మొత్తం 1000 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో జపాన్ కాన్సుల్ జనరల్ సీజీ బాబా మాట్లాడుతూ శ్రీసిటీలో ఇప్పటివరకు 13జపాన్ దేశ పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, ఇక్కడి పరిస్థితులు జపనీస్ యూనిట్ల స్థాపనకు ఎంతో అనుకూలంగా వున్నాయన్నారు. టకాహిసా టకాహరా మాట్లాడుతూ భారత్‌లో తమ వ్యాపార అభివృద్ధిలో భాగంగానే ఈ ప్లాంట్ నెలకొల్పినట్లు తెలిపారు. శ్రీసిటీలో ఏర్పాటు చేయడానికి ఇక్కడున్న అనుకూల పరిస్థితులే కారణమన్నారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవి సన్నారెడ్డి యూనిఛాం సంస్థను కొనియాడారు. ఈ పరిశ్రమ ద్వారా ఖచ్చితంగా ఎక్కువ మంది స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కాస్త ఆలస్యంగానైనా భారతదేశంలో ఆరోగ్య, పరిశుభ్రత ఉత్పత్తులు ప్రజా జీవనశైలిలో భాగమవుతూ విశేష అభివృద్ధి సాధిస్తోందన్నారు.

కిమురా మాట్లాడుతూ శ్రీసిటీ మద్దతు, వ్యాపార సంబంధ భాగస్వామ్యంతో భారత్ మార్కెట్‌లో యూనిఛాం నెంబర్ వన్ స్థానంలో చేరుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.




మాట్లాడుతున్న రోటరీ అధ్యక్షుడు ఎస్వీ అశోక్ చక్రవర్తి

# రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల నూతన కార్యవర్గం

## గూడూరు డివిజన్ వార్తలు

గూడూరులోని ద్వారకామయి ఫంక్షన్ హాల్‌లో రోటరీ, ఇన్నర్‌వీల్‌క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఈ నెల 5వ తేదీ జరిగింది. ఈ కార్యక్రమానికి రోటరీ మాజీగవర్నర్ ఎల్.సత్యనారాయణ విచ్చేసి మాట్లాడుతూ రోటరీ సేవలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయని, కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారు కూడా ఇంకా సేవలు విస్తృతపరచాలని అన్నారు. నూతన కార్యవర్గానికి ఏడాది పాటు సేవ చేసే అవకాశముందని, విజయవంతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా ఎస్వీ అశోక్‌చక్రవర్తి, పి.మునిరాజా, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులుగా పొనకా సునంద, వై.స్నేహ లత ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఏనుగ నరహరిరెడ్డి, నాగ సూరి పాండురంగయ్య మెమోరియల్, శ్రీకృష్ణ సేవాసమితి వారు గూడూరులోని జిల్లా పరిషత్ మరియు చెన్నూరు, నెల్లటూరు బాలుర, బాలికల హైస్కూల్ నందు 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీగవర్నర్లు భరత్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, ప్రతినిధులు రఘురామిరెడ్డి, ఎన్.గోపాలరావు, డాక్టర్ సి.జనార్ధనరెడ్డి, డాక్టర్ సి.రోహిణి, బొమ్మిరెడ్డి మైథిలి, లక్ష్మి, కె.మునిగిరీష్, బొమ్మి శ్రీనివాసులు, మయూరి శ్యాంయాదవ్, కె.సుందరరామిరెడ్డి, ఎన్.ఎస్.రెడ్డి, దశరథరామిరెడ్డి, దయాకర్‌రెడ్డి, రవికుమార్, రొటేరియన్లు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రోహిణి 5లక్షల విరాళం



పొనకా సునందకు 5లక్షల బాండును అందజేస్తున్న డాక్టర్ సి.రోహిణి

రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో డాక్టర్ సి.రోహిణి ఇన్నర్‌వీల్ క్లబ్‌కు 5లక్షలు విరాళం ఇచ్చారు. దానిమీద వచ్చిన వడ్డీతో సేవా కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని వారు కోరారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు పొనకా సునందకు ఈ 5లక్షల బాండును అందజేశారు.

# ముగిసిన పోలీసుల క్రికెట్



మాట్లాడుతున్న డిఎస్పీ బి.శ్రీనివాస్, వేదికపై ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగిన డివిజన్ స్థాయి పోలీసుల క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, డిఎస్పీ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు. డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలో వాకాడు జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ మాట్లాడుతూ క్రీడలంటే పోలీసులకు ఆసక్తి ఉందన్నారు. అయితే విధి నిర్వహణలో ఒత్తిడి ఉండటంతో వీటిపై దృష్టి సారించలేకపోతున్నారన్నారు. పోలీసుల్లో ఒత్తిడి తగ్గించేందుకు ఈ ఏడాది ఉత్సాహ భరిత వాతావరణంలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసుల మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ప్రతి యేడాది ఆహ్లాదకర వాతావరణంలో క్రీడాపోటీలను నిర్వహిస్తామన్నారు. డివిజన్ స్థాయిలో ప్రతిభ చూపినవారు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. అనంతరం విజేతగా నిలిచిన వాకాడు సర్కిల్ జట్టు, రన్నర్‌గా నిలిచిన వెంకటగిరి సర్కిల్ జట్టుకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు శ్రీనివాసులురెడ్డి, సుబ్బారావు, రత్తయ్య, అక్కేశ్వరరావు, విజయకృష్ణ, పట్టణ ప్రముఖులు కోట సునీల్‌కుమార్, వాటంబేడు శివకుమార్, కడివేటి చంద్రశేఖర్, ఎస్‌ఐలు బాబి, గోపాల్, రవినాయక్, పోలీసులు పాల్గొన్నారు.

# గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

- తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

గ్రామాల్లో నెలకొనివున్న భూసమస్యల పరిష్కారం కోసం 7వ తేదీ నుండి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు గూడూరు తహశీల్దార్ వెంకటనారాయణమ్మ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేఖర్లతో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లోని భూసమస్యల పరిష్కారం కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు అర్జీలు ఇచ్చారు. గ్రీవెన్స్‌డేలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆమె సూచించారు.



గ్రీవెన్స్‌డేలో తహశీల్దార్ వెంకటనారాయణమ్మకు అర్జీలు అందజేస్తున్న గ్రామస్తులు

## కాలధర్మం

# నల్లపరెడ్డి హరనాథరెడ్డి



నెల్లూరు జిల్లా రాజకీయాలపై తమదైన ముద్రను వేసుకుని జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా ఇప్పటి తరం వారు కూడా గుర్తుంచుకునేలా పరిపాలన సాగించిన కీర్తిశేషులు నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి మూడవ కుమారుడు నల్లపరెడ్డి హరనాథరెడ్డి జూలై 3వ తేదీ కోటలోని వారి స్వగృహంలో మృతి చెందారు.

గూడూరు డివిజన్‌లో నల్లపరెడ్డి కుటుంబం తరపున ప్రజలందరికి నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించేవారు. పినతండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి 1972లో ఇండిపెండెంట్ ఎమ్మెల్యేగా పోటీచేసినప్పటి నుండి రాజకీయాల్లో గూడూరు డివిజన్‌లో కీలకపాత్ర పోషించారు. 1978లో గూడూరు తాలూకా మున్సబులకు అధ్యక్షులుగా ఉన్నారు. 1987 నుండి 1995 వరకు సింగిల్ విండో అధ్యక్షులుగా ఏకగ్రీవంగా రెండుసార్లు ఎన్నికయ్యారు. 1995లో కోట సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. జిల్లా టిడిపి ఉపాధ్యక్షులుగా 2002 నుండి 2009 వరకు ఉన్నారు. 1999లో వెంకటగిరి ఎమ్మెల్యే టిక్కెట్టు టిడిపి తరపున కోరడం జరిగింది. ఒకే కుటుంబంలో ముగ్గురికి ఇవ్వడం కుదరదని చంద్రబాబునాయుడు చెప్పడం జరిగింది. 2009లో తన అనుచరుడైన పాశం సునీల్‌కుమార్‌కు టిక్కెట్టు కోసం తీవ్ర కృషి చేసి ఆఖరి క్షణంలో వేరేవారికి ఇవ్వడం జరిగింది. 2009 ఏప్రిల్‌లో వైయస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి వై.యస్. కుటుంబంతో ఉన్నారు. జగన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టగానే వైయస్సార్ మీద అభిమానంతో జగన్మోహన్‌రెడ్డితో కొనసాగారు. ఇప్పుడు హరనాథరెడ్డి తనయుడు నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి కోట ఎంపిపిగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తరపున 2014లో ఎన్నికయ్యారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో పరిష్కరిస్తున్నారు.

నల్లపరెడ్డి హరనాథరెడ్డి మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# కామాంధుడిపై నిర్భయ కేసు

- డిఎస్పీ బి.శ్రీనివాస్



రెండేళ్లుగా బాలికపై అత్యాచారం చేస్తున్న నిందితుడు కాల్తిరెడ్డి సుబ్రమణ్యంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, నిర్భయ చట్టం క్రింద కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తెలిపారు. గూడూరులోని ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలికను డిఎస్పీ విచారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక నాగరికతకు దూరంగా సుబ్రమణ్యం ఇంట్లోనే పెరిగిందన్నారు. కనీసం సమయం, నెల, వారాలు, రోజుల పేర్లు కూడా తెలియవన్నారు. ఇంట్లోనే ఉండటం తప్ప మరి ఏ విషయం బాలికకు తెలియదని, నిందితుడు చిత్రహింసలకు గురిచేసేవాడని తెలిపారు. వైద్య పరీక్షల నిమిత్తం ప్రాంతీయ వైద్యశాలకు బాలికను తరలించామని, వయస్సు నిర్ధారణ కోసం నెల్లూరుకు పంపనున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలో పట్టుకుంటామని డిఎస్పీ తెలిపారు.

# ఈవ్‌టీజింగ్‌పై ప్రజల్లో చైతన్యం రావాలి

పట్టణ సిఐ సుబ్బారావు

ఈవ్‌టీజింగ్‌పై ప్రజల్లో చైతన్యం రావాలని పట్టణ సిఐ సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక బనిగిసాహెబ్‌పేట ప్రాంతంలో ఈవ్‌టీజింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రాత్రివేళల్లో పలువురు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి మద్యం సేవిస్తూ మహిళలను వేధిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేసామన్నారు. ఈ ప్రాంతంలో ఎవరైనా మద్యం సేవించి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్వర్‌భాషా, ఖాదర్, మస్తాన్, షబ్బీర్, మధు తదితరులు పాల్గొన్నారు.



గల్పిక

# బాబు పాదాలపై కేసీఆర్ కన్నీటి బొట్లు

అది హైదరాబాద్‌లోని రాష్ట్రపతి విడిది భవనం. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ వేసవి విడిది కోసం అక్కడకు వచ్చి ఉన్నారు. ప్రణబ్ ముఖర్జీ అప్పుడే నిద్రలేచి హాల్‌లోకి వచ్చాడు. టీపాయ్ మీద వున్న పత్రికల్లో మొదట 'తెలుగుజ్యోతి' పత్రికను తీసుకుని చదవసాగాడు. ఫ్రంట్ పేజీలోనే "చంద్రబాబు పరిపాలనా దక్షతను మెచ్చుకున్న రాష్ట్రపతి", "కేసీఆర్ మూర్ఖుడని, అనుభవజ్ఞులు మీరే సర్దుకుపోండి" అని హెడ్డింగ్‌లు పెట్టి వ్రాసారు. తర్వాత 'ఆత్మసాక్షి' పత్రిక చదవసాగాడు. "రాష్ట్రపతిభవన్‌లో చంద్రబాబును అయిష్టంగా చూసిన రాష్ట్రపతి"– 'ఓటుకు నోటు' కేసే కారణం అని వుంది. ఆ రెండు పత్రికలు చదవడంతో ప్రణబ్‌ముఖర్జీకి పిచ్చెక్కినట్లయ్యింది. నేను చంద్రబాబును ఇష్టంగా చూడలేదు, అయిష్టంగా చూడలేదు మరి ఈ పేపర్లెందుకు ఇలా వ్రాసాయని అప్పుడే అక్కడకు వచ్చిన గవర్నర్ నరసింహన్‌ను అడిగాడు. దానికాయన.. వాళ్లంతే సార్, ఎవరికి ఇష్టం వచ్చిన రీతిలో వాళ్లు వ్రాసుకుంటారు. ఇంకా మీ విషయంలో చాలా తక్కువ. సెక్షన్–8పై నేను సీరియస్‌గా ఉన్నానంటూ 'తెలుగుజ్యోతి' పత్రిక, 'ఓటుకు నోటు కేసుపై గవర్నర్ సీరియస్‌గా ఉన్నారని' ఆత్మసాక్షి పత్రిక వ్రాసాయి. అసలు మనకు సంబంధమే లేకుండా, మన నోటిలో నుండి మాట కూడా రాకుండానే మనల్తో ముడిపెట్టి వాళ్లకు కావాల్సింది వాళ్లు వ్రాసేసుకుంటుంటారు అని చెప్పి, ఇదిగోండి తిరుమల ప్రసాదం అని ఒక కవరు ప్రణబ్‌ముఖర్జీ చేతికిచ్చాడు. ప్రణబ్ ముఖర్జీ ఆశ్చర్యపోయి... మొన్ననే కదా వెళ్లొచ్చాం, అప్పటి ప్రసాదం ఇంకా మీ వద్ద ఉందా అని అడిగాడు. నరసింహన్ నవ్వుతూ... నిన్న కూడా తిరుమల వెళ్లొచ్చాను సార్, ఇంట్లో నా శ్రీమతినైనా రోజూ చూడకుండా ఉండగలనేమోగాని, ఆ స్వామిని మాత్రం చూడకుండా ఉండలేకపోతున్నానన్నాడు. అప్పుడు రాష్ట్రపతి మనసులో.. మిమ్మల్ని ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఉంచబట్టి సరిపోయింది, సిక్కింకో, అరుణాచల్‌ప్రదేశ్‌కో గవర్నర్‌గా వేసుంటే, ఫ్లైట్ ఖర్చులకే ఆ రాష్ట్రాల ఆదాయం సరిపోయి ఉండేదనుకున్నాడు.

అంతలో ఓఎస్‌డి వచ్చి సార్, మిమ్మల్ని కలవడానికి ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చారని చెప్పాడు. వెంటనే నరసింహన్... వాళ్లిద్దరూ ఒకే చోట ఉన్నారా... ముఖ్యంగా ఒకరికొకరు ఎదురు పడకుండా చూడండి... బయట లాన్ ఉందన్నాడు. ప్రణబ్ ముఖర్జీ అర్థం కానట్లు ముఖంపెట్టి... లాన్‌కు వాళ్లు ఒకరికొకరు ఎదురుపడడానికి సంబంధమేంటని అడిగాడు. నరసింహన్ దానికి బదులిస్తూ... ఈమధ్య వాళ్లిద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది సార్, ఒకరికొకరు ఎదురుపడితే ఎక్కడ పచ్చగడ్డి మైదానం తగలబడుతుందోనని ముందుజాగ్రత్తగా వాళ్లను ఎదురుపడకుండా చూడమని చెప్పానన్నాడు. నరసింహన్ బుద్ధికుశలతను రాష్ట్రపతి మెచ్చుకుంటూ సీఎంలిద్దరినీ లోపలకు పిలిపించాడు.

రాష్ట్రపతికి చెరోవైపు చంద్రబాబు, కేసీఆర్‌లు కూర్చున్నారు. నరసింహన్ ఎందుకైనా మంచిదని చెప్పి వారి మధ్యలో టీపాయ్ మీద వున్న పేపర్లు, పుస్తకాలను తీసి పక్కనపెట్టాడు. ఎందుకంటే వారిద్దరి మధ్య ఆ పుస్తకాలు ఎక్కడ తగలబడతాయోనని గవర్నర్ భయం. ప్రణబ్ ముఖర్జీ మొదట కేసీఆర్‌ను కదిలించాడు. పరిపాలన గురించి అడిగి ఆంధ్రప్రదేశ్ మీకు అన్నలాంటి రాష్ట్రం. ఆ రాష్ట్రంతో మీకు గొడవలేంటని అడిగాడు. దానికి కేసీఆర్... నా గొడవ ఆంధ్రాతో కాదు సార్, ఈ చంద్రబాబుతోనే. మా ఎమ్మెల్యేలనే కొని నా కొంపనే కూల్చాలని చూసిండు. నేనేం ఆయన మీద వ్యక్తిగత కక్షతో పోలేదు. చట్టప్రకారమే పోతున్నాం. ఆ కేసును ఏసిబి చూసుకుంటుంది. మేం ఆంధ్రాప్రజలతో గొడవపడలేదు. వారితో గొడవ పడితే మాకే నష్టం. హైదరాబాద్‌లో పెట్టుబడిదారులు, సినిమా ఇండస్ట్రీ అంతా వారిదే! ఆంధ్ర ఉద్యోగులనే తరిమేసాం, ఎందుకంటే వాళ్లకు మా ప్రభుత్వం జీతాలివ్వాలి, వీళ్లను మాత్రం ఉంచుకున్నాం, వీళ్లు మా ప్రభుత్వానికి ఆదాయ వనరులు కాబట్టి అని చెప్పాడు.

తర్వాత చంద్రబాబును సమస్య ఏంటని అడిగాడు. అందుకాయన... నేనేమంటానంటే ఈ కేసీఆర్ మా ఫోన్లు ట్యాపింగ్ చేసాడు. అది నేరమంటాను, మా ఫోన్లు ట్యాపింగ్ చేయకపోతే మేం 5కోట్లు పెట్టి ఎమ్మెల్యేను కొనే విషయం ఆయనకు తెలియదు కదా. ఇది నేరం ఎందుకయ్యింది... కేసీఆర్ చేసిన ఫోన్ ట్యాపింగ్ వల్ల. అందుకే... నేనేమంటానంటే... ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్ పైనే కేసులు నమోదు చేయాలంటానన్నాడు. వీళ్లిద్దర్నీ ఇక్కడే కూర్చోబెట్టి మాట్లాడితే ఇద్దరూ జుట్టు జుట్టు పట్టుకుని తన్నుకునే ప్రమాదం ఉందని గ్రహించిన ప్రణబ్‌ముఖర్జీ ముందు కేసీఆర్‌ను రహస్య గదిలోకి తీసుకెళ్లాడు. చంద్రబాబు నీకన్నా సీనియర్, కాని ఇట్లాంటి పని చేస్తాడనుకోలేదు. నేను నీతో మంచిగా ఉండమని చెబుతాను, ఎంతైనా పెద్దోడు కదా, సర్దుకునిపోండి అని కేసీఆర్‌కు చెప్పి పంపాడు. తర్వాత చంద్రబాబును లోపలకు పిలిచి... ఆ కేసీఆర్‌కు సీఎం పదవి కొత్త. అనుభవం లేదు, అన్నీ తెలిసిన నువ్వే సర్దుకుపోకుంటే ఎలా... ఆ కేసీఆర్‌కు కూడా చెప్పాను... కేసులు గట్రా వంటి జోలికి పోకుండా మీతో జాగ్రత్తగా మసలుకోమని అని చెప్పాడు. దాంతో చంద్రబాబు సంతృప్తిగా బయటకొచ్చాడు. ప్రణబ్‌ముఖర్జీ హాల్‌లోకి వచ్చి అక్కడున్న గవర్నర్‌తో... వేసవి విడిది కోసం ఇక్కడికొస్తే వీళ్లిద్దరి సెగ ఎక్కువైందే అని వాపోయాడు.

★ ★ ★ ★ ★

కేసీఆర్ రాత్రి కూడు తిని నీళ్లు త్రాగి మంచం మీద పడుకున్నాడు. రాష్ట్రపతి చెప్పిన మాటలనే మననం చేసుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు. కేసీఆర్ ఇంటి బెల్ మోగింది. ఆయన తలుపు తీసాడు. ఎదురుగా చంద్రబాబు. ఆయన ముఖంలో పశ్చాత్తాపం కనపడలేదు... ఎందుకంటే ఆయన ఆనందపడ్డా, బాధపడ్డా ఫేస్‌లో ఫీలింగ్స్‌లో మార్పు వుండదు. కాని ఆయన తీరును చూస్తుంటే పశ్చాత్తాపంతో వచ్చినట్లే అనిపించింది కేసీఆర్‌కు. చంద్రబాబు వెంటనే కేసీఆర్ చేతులు పట్టుకుని... నన్ను క్షమించు చంద్రశేఖరా, మీ ఎమ్మెల్యేను కొనాలనుకోవడం పొరపాటే... ఇంకెప్పుడూ అలాంటి పనులు చేయను. రాష్ట్రపతి నీ గురించి ఎంతో గట్టిగా చెప్పాడు అని వేడుకోసాగాడు. చంద్రన్నా, ఎంతలేదన్నా మీరు నా గురువు. మీరేంటి నన్ను క్షమాపణ కోరడం, ఇక మీ జోలికి రాను... చేతులు వదలండి... ప్లీజ్ వదలండి అంటూ కేకలు పెడుతూ నిద్రలోనే లేచాడు. ఆ కేకల దెబ్బకు పక్కనే వున్న వాళ్ల ఆవిడ అదిరిపడి లేచి కేసీఆర్ ముఖం మీద నీళ్లు చల్లింది. ఆ దెబ్బకు కేసీఆర్ ఈ లోకంలోకి వచ్చి అప్పటిదాకా వచ్చింది కల అని తెలుసుకున్నాడు.

★ ★ ★ ★ ★

చంద్రబాబు నేరుగా ఇంటికెళ్లాడు. రాష్ట్రపతి మాటలతో కడుపు నిండిన ఆయన పుల్కాలు కూడా తినకుండానే పడుకున్నాడు. కొద్ది సేపటికి కాళ్ల మీద నీటి బొట్లు పడుతున్నట్లు అనిపిస్తే అదిరిపడి కళ్లు తెరిచాడు. కాళ్ల వద్ద కేసీఆర్ నిలబడి వున్నాడు. ఆయన కళ్లల్లోంచి కారుతున్న కన్నీటిబొట్లే చంద్రబాబు కాళ్ల మీద పడసాగాయి. కేసీఆర్ వెంటనే చంద్రబాబు కాళ్లు పట్టుకుని... ఇవి కాళ్లు కావు చేతులనుకోండి, ఇప్పటిదాకా కేసులతో మిమ్మల్ని ఇబ్బంది పెట్టాను. అవి మనసులో ఉంచుకోకుండా నన్ను క్షమించండి. రాష్ట్రపతి చెప్పేదాకా మీ గొప్పతనం తెలుసుకోలేకపోయిన అజ్ఞానిని... మీరు క్షమిస్తేగాని మీ కాళ్లు వదలనని మొండి పట్టు పట్టాడు. కేసీఆర్ వదులు... ఏంటి ఇది చిన్నపిల్లోడిలా... నీలో మార్పు వచ్చింది అంతే చాలు... వదులు వదులు అంటూ కాళ్లను జాడించసాగాడు. ఆ అలికిడికి పక్కనేవున్న భువనేశ్వరీదేవి లేచింది... చంద్రబాబు కాళ్లు జాడిస్తుండే సరికి భయమేసి ఆయనను గట్టిగా తట్టింది. చంద్రబాబు నిద్రలోనే... ఆ కేసీఆర్‌ను కాళ్లు వదలమను అని అరవసాగాడు. ఇలా అయితే లాభం లేదనుకున్న భువనేశ్వరీదేవి బిందెడు నీళ్లు తెచ్చి ఆయన మీద పోసింది. చంద్రబాబు ఆ దెబ్బకు ఠక్కున లేచి కేసీఆర్ ఏడి... ఇప్పటిదాకా కాళ్లు పట్టుకుని వదల్లేదు. కాళ్లు పట్టుకున్నప్పుడు ఒక ఫోటోనన్నా తీసి వుండాల్సింది... అని అనసాగాడు. మీకీమధ్య కలలు ఎక్కువయ్యాయి. కేసీఆర్ రాలేదు, కాళ్లూ పట్టుకోలేదు. కలలు మాని నిజలోకంలోకి రండి అని భువనేశ్వరీదేవి చెప్పడంతో చంద్రబాబు నిరాశగా మళ్లీ ముసుగుతన్ని పడుకున్నాడు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి పెడతారు. స్థిరాస్తుల వ్యవహారాలు నిర్ణయం కాగలవు. అగ్రిమెంట్లు, భాగస్వామ్య పెట్టుబడులకు అనుకూల సమయం. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, అభివృద్ధి ఉంటుంది. ప్రణాళికా బద్ధంగా పనులు జరుపుకొంటూ వస్తారు. ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు సర్దుబాటు కాగలవు. మొగమాటాలకు దూరంగా ఉండండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఈ వారం కూడా ఖర్చులు అధికంగానే ఉంటాయి. అవసరాలకు డబ్బు సర్దుబాటు అవుతుంది. విద్యార్థులకు మంచి ఫలితాలు, ఉద్యోగప్రయత్నాలు చేసే వారికి అనుకూలత కలదు. వ్యాపారాలలో కొద్ది ఇబ్బందులుండినా, ఆదాయం లోపం రాదు. వృత్తి నిర్వహణలో మంచి పేరు, రాబడి ఉంటుంది. సభలు, సమావేశాలలో మీ మాటకు విలువ, గుర్తింపు ఉంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వృత్తి వ్యాపారాలలో కొన్ని అవకాశాలు తప్పిపోగలవు. ఆర్థిక ఇబ్బందులుండినా సామాన్య ఆదాయానికి లోపం రాదు. తొందరపడి కొత్తగా పెట్టుబడులు, వ్యాపార భాగస్వామ్యాల జోలికి పోవద్దు. ప్రభుత్వ అనుమతులందు ఆలశ్యం కలుగుతుంది. కుటుంబసౌఖ్యం బాగుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు దొరుకును. కొత్త విషయాలపై కుటుంబంలో చర్చ ఉండవచ్చును.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

చేపట్టిన పనులను సమర్థవంతంగా పూర్తి చేస్తారు. కృషికి తగ్గ ప్రయోజనం, గుర్తింపు పొందుతారు. వృత్తి వ్యాపారాలు ఆదాయాన్ని పెంచగలవు. సొంత పని జరుగుటకు వచ్చిన అవకాశాన్ని చక్కగా వాడుకుంటారు. కొత్త వ్యాపారాలలో భాగస్వామ్యానికి, పెట్టుబడులకు అవకాశాలు దొరుకుతాయి. అనవసర విషయాలలో చొరబడటం, హామీలివ్వడం చేయవద్దు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపార అభివృద్ధి అవకాశాలు తాత్కాలికంగా తగ్గుతాయి. అనుకోని దూరప్రయాణాలు, ప్రముఖులను కలుసుకొనడం జరుగుతుంది. అనుకున్న పనులు జరగడానికి చాలా గట్టి ప్రయత్నాలు చేయాలి. ఆదాయానికి తగిన ఖర్చులు పైనబడగలవు. కుటుంబ సభ్యుల చదువులు, ఆరోగ్య విషయాలపై ఆందోళన ఉంటుంది. ఇతరులకు సహాయం చేసి మాటపడవలసి ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభవార్తలు వినడం, అనుకున్న పనులు సాఫీగా జరగడం, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. ఉద్యోగులకు పని తీవ్రత, అధికారుల వత్తిడి ఉంటుంది. ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. వస్త్రాభరణ మందులు పచారి షాపుల వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనం కలవారు తీరిక లేకుండా శ్రమించగలరు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 10.07.2015 నుండి
తేది. 16.07.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మేష వృషభ మిధున కర్కాటక రాశులలో చంద్రుడు, మిధునములో రవి కుజ బుధులు, కర్కాటకంలో గురువు మరియు 14తేది నుండి సింహంలో గురువు, సింహంలో శుక్రుడు, కన్యలో గురువు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

**పంచాంగము:**
ముహూర్తములు లేవు

తేది 14 మంగళవారము గురువు సింహరాశి ప్రవేశము గోదావరి నదీ పుష్కరాలు ప్రారంభము.

### అధికాషాఢమాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | నవమి | ప॥ గం.1.07వ॥ |
| తేది. 11 | శని | దశమి | ప॥ గం.11.05వ॥ |
| తేది. 12 | ఆది | ఏకాదశి | ఉ॥గం.9.18వ॥ |
| తేది. 13 | సోమ | ద్వాదశి | ఉ॥గం.7.53వ॥ |
| తేది. 14 | మంగళ | త్రయోదశి | ఉ॥గం.6.52వ॥ |
| తేది. 15 | బుధ | చతుర్దశి | ఉ॥గం.6.19వ॥ |
| తేది. 16 | గురు | అమావాస్య | ఉ॥గం.6.17వ॥ |
| | పిదప | నిజాషాఢ శుక్ల పాడ్యమి | పూర్తిగ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అనుకున్న పనులకు కొద్ది ఆటంకాలు ఎదురుకాగలవు. కుటుంబంలో స్వల్ప అపార్థాలుండి ఇబ్బంది పడతారు. కొద్దిపాటి సమస్యలుండి సర్దుబాటు కాగలవు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగి ఆదాయాన్ని పెంచుతాయి. బంధువర్గంతో విభేదాలు రావచ్చును. ఆరోగ్యం జాగ్రత్త. ఉద్యోగులు పొరపాట్లు చేయకుండా జాగ్రత్తపడి, అధికారులతో పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కోర్టు కేసులు యధాస్థితిలో ఉంటాయి. సభలు, సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కొత్త ఉద్యోగావకాశాలు దొరికే అవకాశం ఉన్నది. ఆర్థిక ఇబ్బందులుండి బయట పడతారు. వ్యాపారవర్గాలకు కొద్దిపాటి అవకాశాలు చేజారిపోవచ్చును. అనుకున్న పనులు నిదానంగా జరుగుతూ టెన్షన్ పెడుతాయి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

అనుకున్న పనులు సరిగా జరగక వాయిదా వేసికొనవలసి వస్తుంది. అవసరాలకు ఋణాలు చేస్తారు. బాకీల చెల్లింపుల వత్తిడి పెరుగుతుంది. అన్ని విధాల జాగ్రత్త పడవలసిన సమయం. ఆశించిన అవకాశాలు వ్యాపారవర్గాలకు దొరకక పోవచ్చును. వృత్తి జీవనం కలవారికి సామాన్య ఆదాయము. శుభకార్యాల ఖర్చులు గాని, వైద్య ఖర్చులు గాని ఎక్కువగా ఉంటాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధుమిత్రుల సహకారంతో శుభకార్యాలు నిర్ణయం కావచ్చును. దూరప్రయాణాలుంటాయి. రావలసిన బాకీలు, ఋణాల చెల్లింపు జరుగుతాయి. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా అభివృద్ధికరంగా ఉంటాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. అయితే కొద్దిపాటి టెన్షన్ ఉంటుంది. స్థలాలు ఇండ్లు వంటివి క్రయవిక్రయాలు జరగవచ్చును.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

విలువైన వస్తు వాహన ఆభరణాలను సమకూర్చుకొంటారు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది. అధికారుల సహకారం బాగుంటుంది. వ్యాపారాలలో మెరుగైన పరిస్థితులుండి ఆదాయం బాగుంటుంది. వివాదాలు, కోర్టు కేసులు రాజీకి రావచ్చును. ఆర్థిక పరమైన ఉద్యోగ పరమగు ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. గృహమార్పులుండవచ్చును.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వ్యాపారాలలో వృత్తులందు ఆదాయం పెరుగుతుంది. ఆహ్వానాలు అందుకుంటారు. బంధుమిత్రులను ప్రముఖులను కలుసుకొనడం, గృహోపకరణాలు సమకూర్చుకొనడం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపవలసి ఉంటుంది. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. కృషికి తగ్గ గుర్తింపు గౌరవాలుంటాయి.

# గుడి పక్కన బ్రాందీషాపు..!

## ➤ అడ్డుకుంటున్న భక్తులు ➤ పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు





**కావలి పట్టణంలో అది గుడా... బడా అన్న తేడా లేకుండా... కాపురా లుంటున్న కాలనీలని కూడా చూడ కుండా... ఎక్కడబడితే అక్కడ మద్యం షాపులు ఏర్పాటు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదు.**

తాజాగా కావలి ట్రంకురోడ్డులోని దక్షిణంపేట శ్రీ కోదండరామస్వామి దేవ స్థానం ప్రక్కనే కొత్తగా బ్రాందీషాపును ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఎక్సైజ్ శాఖ సిఐ రామారావుకు దేవస్థాన కమిటీ సభ్యులు కలసి వినతిపత్రం అందజేశారు. అయితే ఎక్సైజ్ అధికారులు గుడి ఎండో మెంట్‌లో చేరి ఉంటే నిబంధనలు వర్తి స్తాయి తప్ప మిగిలిన గుడుల పక్కన పెట్టు కోవచ్చని బ్రాందీషాపు యజమాన్యులకు భరోసా ఇవ్వడంతో వారు ప్రారంభానికి షాపును సిద్ధం చేశారు.

దీనికి శ్రీ కోదండరామస్వామి ఆలయ కమిటీ సభ్యులు మరియు భక్తులు ఆగ్ర హించి మంగళవారం పెద్దఎత్తున ట్రంకు రోడ్డుపై ధర్నాకు దిగడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి భక్తులకు సర్దిచెప్పి ధర్నాను విరమింపజేశారు. ఈ సంద ర్భంగా దేవస్థానం అధ్యక్షుడు బాలయ్య మాట్లాడుతూ 200సంవత్సరాల చరిత్ర కలిగిన గుడి పక్కన బ్రాందీ షాపు పెట్టడం బాధాకరమని, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. దీనికితోడు ప్రక్కనే ప్రభుత్వ వైద్యశాల కూడా ఉన్నందున అధికారులు ఆలోచించి బ్రాందీషాపును మరో చోటికి తరలించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందుకూరి వెంకటసత్యనారాయణ, వైసిపి నాయకుడు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, టిడిపి నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.



## కావలి కబుర్లు



# ప్రతాప్‌తో గ్రంధి మాటా మంతి

తెలుగుదేశం నాయకులు, మాజీ ఏఎంసి ఛైర్మెన్ గ్రంధి యానాదిశెట్టి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మధ్య మంతనాలు జరిగినట్లు తెలుస్తోంది. 12వ వార్డు కౌన్సిలర్ చేవూరు తిరుపాల్‌ను పరామర్శించేందుకు ఎమ్మెల్యే వెళ్లగా అప్పటికే యానాదిశెట్టి అక్కడ వున్నారు. దీంతో ఇద్దరూ కొంత సమయం మాట్లాడు కున్నట్లు సమాచారం. కావలి పురపాలక సంఘం ఛైర్మెన్‌గా వున్న యానాదిశెట్టి కుమార్తె పోతిగంటి అలేఖ్య విషయం కోర్టులో కేసు జరుగుతున్న నేపథ్యంలో ఈ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల పురపాలక సంఘం బడ్జెట్ సమావేశం ఇన్‌ఛార్జి ఛైర్మెన్ గుండ్లపల్లి భరత్‌కుమార్ ఆధ్వర్యంలో జరగడం యానాదిశెట్టి తెలుగుదేశంపార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం పలు అనుమానాలకు తావి స్తుందని పట్టణంలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి.

# వైద్యవృత్తిలో ఆదర్శప్రాయుడు ప్రభాకర్‌నాయుడు

డా॥ ఎన్.ప్రభాకర్‌నాయుడు ప్రస్తుతం నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోనే వైద్యవృత్తిలో ఆరితేరిన వారని, అలాంటి ఆయన యువ డాక్టర్లకు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. వైద్యుల దినోత్సవం సందర్భంగా 5వ తేదీ స్థానిక బృందావనం కల్యాణ మండపంలో పట్టణంలోని రోటరీ క్లబ్ సభ్యులు ఆయనను ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ గతంలో కావలి పుర అధ్య క్షులుగా పనిచేసి కావలికి ఒక గుర్తింపును తీసుకువచ్చారన్నారు. అలాగే వైద్యవృత్తిలో




ప్రజలకు ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కావలి, పరిసర ప్రాంత ప్రజల గుండెల్లో ఆయన చెరగని ముద్ర వేశారని, ఇప్పటికీ ఎంతో క్లిష్టమైన కేసు లను స్వీకరించి ఎందరికో పేదవారికి పునర్జన్మనిచ్చారన్నారు. ఆయన ఏరియా వైద్యశాలలో పుర అధ్యక్షులుగా పనిచేసిన కాలాన్ని మరవురాని యుగంగా అభి వర్ణించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మెన్ గ్రంధి యానాదిశెట్టి, రోటరీక్లబ్ అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ఐఎంఏ సభ్యులు, రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, కార్యదర్శి డా॥ టి.నాగమణి, బృందావనం హౌసింగ్ కాలనీ అధ్యక్షులు మాల్యాద్రి మరియు పట్టణంలోని డాక్టర్లు, ప్రముఖులు పాల్గొన్నారు.



# పేద వృద్ధులకు నిత్యావసర సరుకులు



కావలి పట్టణం లోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజనకాలనీలో సుమారు 50మంది పేద వృద్ధులకు శ్రీ సాయి పేద వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సరుకులను జవహర్ భారతి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పోతురాజు చేతులమీదుగా వృద్ధులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీగగన్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు గగనకుమారి మాట్లాడుతూ సమాజంలో జీవనోపాధి లేక నిరాధరణకు గురౌతున్న వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నిర్వాహకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# బీద బుజ్జమ్మ



కావలి మాజీశాసనసభ్యులు, రాజధాని నిర్మాణ కమిటీ సభ్యులు బీద మస్తాన్‌రావు మాతృమూర్తి బీద బుజ్జమ్మ 7వ తేదీ మంగళవారం స్వర్గస్తురాలై నారు. ఆమె వయస్సు 82 సంవత్సరాలు. బుజ్జమ్మకు కుమారుడు మస్తాన్‌రావుతో పాటు నలుగురు కుమార్తెలు వున్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ 10వ డివిజన్ కార్పొరేటర్ దేవరాల పెదమస్తానమ్మ కూడా ఆమె కూతురే! ఆమె రెండవ కుమార్తె చినమస్తానమ్మ కూడా రాజకీయ అనుభవం కలిగినామే. తెనాలి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఆమెకు మంచి పేరుంది. బీద మస్తాన్‌రావు బుజ్జమ్మకు 3వ సంతానం కాగా మస్తాన్‌రావు చెల్లెళ్లు విజయలక్ష్మి, రాజేశ్వరిలు రాజకీయాలకు దూరంగా వున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరులోని బొల్లినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుజ్జమ్మ తుదిశ్వాస విడిచారు. తన బిడ్డల ఉన్నతి కోసం, వారి అభివృద్ధి కోసం బుజ్జమ్మ ఎంతగానో పాటుపడ్డారు. మాజీశాసనసభ్యుడు గానే కాకుండా రాజకీయాలకు అతీతంగా మస్తాన్‌రావుకు స్నేహశీలిగా మంచి పేరుంది. తాను చదువుకునే రోజుల నుండీ తన సహచర విద్యార్థులందరితోనూ అత్యంత సన్నిహిత స్నేహ బాంధవ్యాలను మస్తాన్‌రావు ఏర్పరచుకునేవాడని ఆయన మిత్రులు చెప్తుంటారు. ఆ అనవాయితీ తప్పకుండా రాజకీయాలలోనూ, వ్యాపార పరంగానూ మస్తాన్‌రావు మంచి పరిచయాలతో ఎంతో మంది ఆప్తులను పొందాడు. ఆయన తల్లి మృతి చెందిందని తెలిసి వందలాది మంది బీద కుటుంబ ఆప్తులు, వేలాది మంది అభిమానులూ ఇస్కపల్లికి తరలివచ్చి బుజ్జమ్మ అంతిమయాత్రలో పాల్గొన్నారు. తమ మాతృమూర్తి మరణంతో బీద కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఆమె మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఒకే కాన్పులో ముగ్గురు చిన్నారులు

## • వైద్యసదుపాయాలందజేసిన రవి చిన్నపిల్లల ఆసుపత్రి



ఒకే కాన్పులో ముగ్గురు చిన్నారులు జన్మించి ప్రాణాపాయ స్థితిలో ఉండగా నెల్లూరులోని రవి చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యులు ఆ పిల్లలను కాపాడారు. మంగళ వారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమా వేశంలో రిచ్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరుకు చెందిన పెంచలమ్మ, పెంచలకుమార్ దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు ఆడ శిశువులు జన్మించారని, 10వేల కాన్పుల్లో ఒకటి మాత్రమే ఇలా జరుగుతుందన్నారు. అయితే ఆ శిశువులు 1.4కిలోలు, 1.5 కిలోలు, 1.6కిలోలు చొప్పున తక్కువ బరువుతో పుట్టడమే కాకుండా మెదడు, గుండె, ఊపిరితిత్తులు వంటి ప్రధాన అవ యవాలు ఎదుగుదల లేకుండా ప్రాణా పాయస్థితిలో తమ ఆసుపత్రికి వచ్చా రన్నారు. ఆ బిడ్డలకు ఎన్టీఆర్ వైద్యసేవా పథకం ద్వారా ఉచితంగా అత్యుత్తమ వైద్యాన్ని అందించడం జరిగిందన్నారు. కృత్రిమ శ్వాసను అందిస్తూ పూర్తి స్థాయి వైద్య చికిత్సలు అందించడంతో ముగ్గురు చిన్నారులు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడి కోలుకుంటున్నారని, ఈ అరుదైన వైద్యాన్ని రిచ్ హాస్పిటల్ అందించి సింహపురి వైద్య చరిత్రకి తల మానికం అయిందని తెలిపారు.

# తమిళనాట తెలుగు వెలుగు

(మొదటిపేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధికశాతం మంది తెలుగువాళ్ళు నివసించేది తమిళ నాడులోనేనన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే, ఇటీవలి కాలంలో ఆ సంఖ్య 2 కోట్లకు చేరువవుతుండడమే విశేషం. తమిళ-తెలుగుసోదరుల సోదరభావానికి, సంఘీభావానికి, వారి సామరస్యపూర్వక జీవనానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలి?.. తెలుగువారికి ఇంతకన్నా ఆనందం ఇంకేమి కావాలి?..

తమిళనాడులో ఎంతోకాలం నుంచి ఎంతో మంది తెలుగువారు నివసిస్తూ, అన్ని రంగాల్లో తమవంతు సేవలందిస్తూ, తమిళనాడులో తెలుగు వెలుగులు విర జిమ్ముతూనే వున్నారు. ప్రత్యేకించి సామరస్యతకు, సోదరభావానికి ప్రతీకగా వున్న తమిళనాడులో తెలుగు వారెందరో ఎంతోకాలంగా గౌరవ ప్రదంగా జీవిస్తూనే వున్నారు. ఈ నేపధ్యంలో తమిళనాడులో వున్న 32జిల్లా ల్లోనూ తెలుగువారి సంఖ్య గణనీయంగానే పెరుగుతోందని తాజాగా నిర్వహించిన ఓ అనధికార సర్వే ద్వారా తెలుస్తోంది. ఆ గణాంకాల ప్రకారం, ఒక్క చెన్నై నగరంలోనే సుమారు 46లక్షల మందికి పైగా జనాభా వుంటే, అందులో 18లక్షల మందికిపైగానే తెలుగువారు వుండడం విశేషం. అదేవిధంగా, తమిళ నాడులోని మొత్తం 32 జిల్లాల్లో జనాభా సంఖ్య 7 కోట్ల 19 లక్షలుగా వుంటే, అందులో తెలుగువారు కోటీ 95 లక్షల దాకా వున్నారంటే, తమిళనాడులో తెలుగువెలుగులు ఎంతగా ప్రకాశమాన మవుతున్నాయో అర్థమవుతోంది. తిరువళ్లూరు జిల్లాలో అత్యధికంగా 14.92 లక్షల మంది దాకా తెలుగువారు వుంటే, కాంచీపురంలో 14 లక్షలు, కోయంబత్తూరులో 12.11 లక్షలు, వెల్లూరులో 11.82 లక్షలు, మధురైలో 10.64 లక్షల మందిదాకా తెలుగువారున్నారంటే ఎంతో ఆనందం కలుగుతోంది కూడా. ఇంకా అనేక జిల్లాల్లోనూ తెలుగు వారు ఇప్పుడు గణనీయమైన సంఖ్యలోనే వున్నారు.

ఇప్పుడే కాదు, గతంలోనూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వున్నప్పుడు కూడా తెలుగువారికి ఎంతో ఖ్యాతి వుండేది. పూర్వంలో మద్రాసు ప్రెసిడెన్సీకి వున్న తొలి ఆరుగురు ముఖ్యమంత్రుల్లో పానగల్‌రాజా, బి.మునుస్వామి, బొబ్బిలిరాజా, టంగుటూరి ప్రకాశం, ఒమందూరు రామస్వామి రెడ్డియార్, కుమారస్వామి రాజా తెలుగు వారే కావడం విశేషం. నేటికీ ఎంతోమంది తెలుగువారు తమ ప్రతిభాపాటవాలతో రాణిస్తూనే వున్నారు. క్రమేణా తమిళనాట తెలుగు మాట్లాడేవారి సంఖ్య పెరుగుతూనే వుంది. ఈ క్రమంలో, ఇటీవలి కాలంలో తెలుగువారికి చెందిన అనేక కులాలవారు ఆయా కులాలవారీగా సంఘాలు కూడా ఏర్పాటు చేసుకున్నారు. అయితే, తెలుగు సంస్కృతి వికాసానికి, తెలుగుభాషాభివృద్ధికి జరిగిన అభివృద్ధి ఆశించినస్థాయిలో లేకపోవడం కొంత వెలితిగానే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో, ఎవరికి వారు విడివిడిగా కాకుండా, అందరి కోసం అందరూ అన్నట్లుగా అంతా కలిసిమెలిసి ఐక్యంగా వుంటే అనేక రకాల సమస్యల పరిష్కారానికి వీలవుతుందనే ఆలోచనల్లోంచి అఖిల భారత తెలుగు సమాఖ్య అవతరించింది. తమిళనాడులో తెలుగుభాష మాట్లాడే 23 కులాలవారికి సంబంధించిన సంఘాలన్నిటినీ ఒక తాటి మీదకు తెచ్చేందుకు, తద్వారా తెలుగువారికి సంబంధించిన పలురకాల సమస్యల పరిష్కారానికీ, ప్రత్యేకించి తెలుగుభాష ఉద్దీపనకూ అవసరమైన కృషిని చేపట్టాలనే బృహత్‌ప్రయత్నానికి ఒక మంచి వేదిక ఆవిర్భవించింది. దానిపేరే అఖిలభారత తెలుగు ఫెడరేషన్. తమిళ నాడులో వున్న తెలుగువారికి అన్నివిధాలా వెన్నుదన్నుగా వుంటూ, తెలుగోళ్ల సమస్యల పరిష్కారానికి నడుము బిగిస్తూ, తెలుగు భాష మాట్లాడేవారి 23 సంఘాలను ఒకే వేదిక మీదికి తెస్తూ 1989లో అఖిల భారత తెలుగు ఫెడరేషన్ ఏర్పాటైంది. ఎంతోకాలంగా తమిళనాడులో వుంటూ, వైద్యరంగంలో నిరుపమానమైన సేవలం దించి ప్రఖ్యాతి చెందిన ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి వ్యవస్థాపక అధ్యక్షునిగా ఏర్పాటైన ఈ సమాఖ్య తమిళనాడులో తెలుగువారి అభ్యున్నతికి కృషి చేస్తోంది. తెలుగువారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తోంది. ప్రత్యేకించి తెలుగుభాష అభివృద్ధి కోసం తెలుగు పాఠశాలలు నెలకొల్పేందుకు, పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులను నియమించేందుకు, తెలుగు పాఠ్యపుస్తకాలను అందుబాటులోకి తెచ్చేందుకు, తెలుగువారికి ఉపాధి అవకాశాలు మెరుగుపరచేందుకు ఈ సమాఖ్య ఎంతగానో కృషి చేస్తోంది. తమిళనాడులోని ప్రముఖులను, జాతీయస్థాయి ప్రముఖులను కూడా తమ సమావేశాలకు ఆహ్వానించి తెలుగుభాషాభివృద్ధికి అవసరమైన సూచనలు చేస్తోంది. ప్రత్యేకించి, తమిళ-తెలుగు సోదరుల పరస్పర సహకారాన్ని, ఐక్యతాభావాన్ని వెల్లడిచేస్తూ, రాష్ట్ర అభ్యున్నతి కోసం గతంలో త్యాగాలు కోర్చిన తెలుగువారిని, స్వాతంత్ర్య సమర యోధులను, సీనియర్ సిటిజన్లను అందరినీ ఆహ్వానించి తమిళ-తెలుగు సోదరుల సామరస్యతను లోకానికి చాటుతోంది. రాజకీయాలకు అతీతంగా ఏర్పడిన ఈ సమాఖ్య, తెలుగువారి అభ్యున్నతిని కాంక్షిస్తూ, తెలుగు సంస్కృతిని, తెలుగు భాషను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతోండడం ఎంతైనా విశేషం. ఏదేమైనా, తమిళనాడులోని దాదాపు అన్ని ప్రాంతాల్లో తమిళ- తెలుగుసోదరులు ఐక్యతాభావానికి ప్రతీకగా వుంటూ, ఎంతో సామరస్యపూర్వక వాతావరణంలో కలిసి మెలిసి జీవిస్తుండడం, తమిళనాడులోనూ తెలుగు వెలుగులు మరింత దేదీప్యమానం అవుతుండడం హర్షదాయకమే!...

## తమిళనాడులో జిల్లాల వారీగా తెలుగు ప్రజల వివరాలు

| జిల్లా | జనాభా సంఖ్య | శాతం | తమిళులు | తెలుగువాళ్ళు(లక్షల్లో) |
|---|---|---|---|---|
| 1. అరియలూర్ | 7,55,000 | 7.6 | 15% | 1.14 |
| 2. చెన్నై | 46,47,000 | 46.5 | 40% | 18.40 |
| 3. కోయంబత్తూర్ | 34,58,045 | 34.6 | 35% | 12.11 |
| 4. కడలూర్ | 26,06,000 | 26.1 | 25% | 6.53 |
| 5. ధర్మపురి | 15,07,000 | 15.1 | 30% | 4.53 |
| 6. దిండిగల్ | 21,60,000 | 21.6 | 25% | 5.40 |
| 7. ఈరోడ్ | 22,52,000 | 22.5 | 20% | 4.50 |
| 8. కాంచీపురం | 39,98,000 | 40.0 | 35% | 14.00 |
| 9. కన్యాకుమారి | 18,70,000 | 18.8 | 10% | 1.88 |
| 10. కరూర్ | 10,64,000 | 10.6 | 20% | 2.12 |
| 11. కృష్ణగిరి | 18,80,000 | 18.8 | 35% | 6.58 |
| 12. మధురై | 30,38,000 | 30.4 | 35% | 10.64 |
| 13. నాగపట్నం | 16,16,000 | 16.2 | 20% | 3.24 |
| 14. నమక్కల్ | 17,27,000 | 17.3 | 20% | 3.46 |
| 15. నీలగిరి | 7,35,000 | 7.4 | 15% | 1.11 |
| 16. పెరంబదూర | 5,65,000 | 5.7 | 12% | 0.68 |
| 17. పుదుకోట్టై | 16,18,000 | 16.2 | 20% | 3.24 |
| 18. రామనాథపురం | 13,53,000 | 13.5 | 15% | 2.03 |
| 19. సేలం | 34,82,000 | 34.8 | 25% | 8.70 |
| 20. శివగంగ | 13,39,000 | 13.4 | 25% | 3.35 |
| 21. తంజావూర్ | 24,06,000 | 24.1 | 25% | 6.03 |
| 22. థెని | 12,46,000 | 12.5 | 35% | 3.75 |
| 23. తిరునెల్వేలి | 30,77,000 | 30.8 | 10% | 3.08 |
| 24. తిరువళ్ళూరు | 37,28,000 | 37.3 | 40% | 14.92 |
| 25. తిరువణ్ణామలై | 24,65,000 | 24.7 | 25% | 6.17 |
| 26. తిరువారూర్ | 12,64,000 | 12.6 | 20% | 2.52 |
| 27. తూత్తుకొడ | 17,50,000 | 17.5 | 25% | 4.38 |
| 28. తిరుచిరాపలి | 27,22,000 | 27.2 | 30% | 8.16 |
| 29. తిరుపూర్ | 24.79,000 | 24.8 | 25% | 6.20 |
| 30. వెల్లూర్ | 39,36,000 | 39.4 | 30% | 11.82 |
| 31. విల్లుపురం | 34,59,000 | 34.6 | 25% | 8.65 |
| 32. విరుదునగం | 19,42,000 | 19.4 | 30% | 5.85 |
| మొత్తం | 7,19,00,000 | | 27.12% | 1.95 కోట్లు |

# కవితల పోటీలకు ఆహ్వానం

ప్రముఖ కవి, రచయిత చిన్ని నారాయణరావు ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఏర్పాటైంది. ఈనెల 26వతేదీ నెల్లూరు టీటీఎస్ కల్యాణ మండపంలో ఆవిర్భావ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా జిల్లా స్థాయి కవితల పోటీలను ఏర్పాటు చేసారు. ఆరోజు జరిగే సాహిత్యసదస్సులో ప్రముఖ కవి శివారెడ్డి చేతుల మీదగా బహుమతి ప్రదానం జరుగుతుందన్నారు. 30పంక్తులకు మించకుండా ఏదైనా సామాజిక అంశం పై రాసిన రచనలు పంపాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు రెండు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామన్నారు. తమ కవితలను ఈ నెల 20వ తేదీలోగా చిన్ని నారాయణరావు, అధ్యక్షులు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రచయితల సంఘం, రూంనెం.15, 2వ అంతస్తు, కెవిసి ప్లాజా, ఆర్ఆర్ వీధి, నెల్లూరు చిరునామాకు పంపాలని కోరారు.

# గోదావరిలో నిధుల వరద

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడే పనుల జోలికే పోవడం లేదు. సంక్రాంతి చంద్రన్న కానుక, రంజాన్ తోఫా వంటివన్నీ తాత్కాలిక ఆకర్షణలే. ఇక సింగపూర్ రాజధాని అంటూ అరచేతిలో సినిమా చూపిస్తున్నాడు. ఓ పక్క ఉద్యోగుల జీతాలకు డబ్బులు లేని పరిస్థితి. దిన దిన గండం నెలనెల ఆయుష్షుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వుంది. ఓ రోడ్డుకో, కాలువకో, ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కో వందకోట్లు మంజూరు చేయాలంటే వందసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఇలాంటి కరువు కాలంలో గోదావరి పుష్కరాలకు మాత్రం 1400కోట్లు మంజూరు చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. పుష్కరాలు ఒక్క తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జరిగేవి మాత్రమే కాదు. గోదావరి నదీ ప్రవాహప్రాంతాలన్నింటిలోనూ పుష్కరాలు జరుపుతారు. తెలంగాణలోనూ గోదావరి ప్రవహిస్తుంది. అలాగని తెలంగాణ సీఎం కేసీఆర్ పుష్కరాలకు ఇన్ని వందలకోట్లు మంజూరు చేయలేదే. పుష్కరాలను చంద్రబాబు బ్రహ్మాండంగా నిర్వహించాడన్న కీర్తి కండువాను మెడలో వేసుకోవడానికే ఆయన ఇన్ని కోట్లు ఖర్చు పెడుతున్నాడు. 2003లో కూడా గోదావరి పుష్కరాలు బాగా చేసాడన్న కీర్తి కిరీటం చంద్రబాబుకే లభించింది. 1400కోట్లు ఖర్చుపెట్టి చేసిన పనులు శాశ్వతం కాదు. గోదావరికి మంచి వరద వచ్చిందంటే చాలా పనులు కొట్టుకుపోయేవే. ఇప్పుడు చేసిన కొన్ని పనులు మళ్ళీ 12ఏళ్లకు గాని ఉపయోగపడవు. అప్పటిదాకా ఈ పనులు నిలిచేవి కావు. ఒకరకంగా వందల కోట్లను గోదావరిలో వేసినట్లే ననుకోవచ్చు.

అదే ఈ 1400కోట్లతో ఒక పెండింగ్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి రెండు, మూడు జిల్లాలకు సాగునీటి, తాగునీటి సమస్యను తీర్చి ఉండొచ్చు. లేదంటే ఒక్కో జిల్లాకు వందకోట్ల లెక్కన అభివృద్ధి పనులకు మంజూరు చేయొచ్చు. ఇంతవరకు ఎమ్మెల్యే నిధుల క్రింద ఒక్క రూపాయి ఇవ్వలేదు. నిధులు లేక చేయడానికి పనులు లేక ఎమ్మెల్యేలు గోళ్లు గిల్లుకుంటున్నారు. ఈ 1400కోట్లను 175మంది ఎమ్మెల్యేలకు నియోజకవర్గానికి 8కోట్లు లెక్కన కేటాయిస్తే కనీసం ప్రాథమికంగా అవసరమైన మంచినీళ్లు, డ్రైనేజీ, రోడ్లు వంటి పనులు చేసుండేవాళ్లు. అలా చేస్తే ఎమ్మెల్యేలకు పేరొస్తుంది గాని చంద్రబాబుకు ఏమొస్తుంది. 1400కోట్లు తగలేసి పుష్కరాలను బాగా చేసాడన్న కీర్తి కోసమే చంద్రబాబు గోదావరిలో కోట్ల కట్టలు ముంచాడు.


# మంత్రయ్యేదెవరు?

(మొదటిపేజీ తరువాయి)

ఇంకో ఇద్దరు రెడ్లనన్నా మంత్రి వర్గంలోకి తీసుకోవాల్సి వుంది. అయితే ఒకేసారి ఒకే వర్గం నుండి ఇద్దరికి ఇవ్వలేడు కాబట్టి ఒకరికి ఇవ్వడానికి సిద్ధంగా వున్నారు.

'రెడ్డి' సామాజికవర్గం నుండి పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అయితేనేమీ, పార్టీ కార్యకర్తలు, నాయకుల కోసం అయితేనేమీ, పార్టీలో సీనియార్టీ పరంగా అయితేనేమీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. నెల్లూరు జిల్లాలో పార్టీకి ఆయన మంత్రి కావడం అవసరం కూడా! అయితే చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడుగా వున్న నారాయణ ఈ జిల్లా వాడు కావడమే సోమిరెడ్డి అవకాశాలకు గండికొడుతుంది. 2014 ఎన్నికల్లో తెలుగుదేశంకు పెట్టుబడిదారుడు నారాయణ. ఆయన అందించిన ఆర్థిక సహకారానికి ఫలితంగా మున్సిపల్ మంత్రి అయ్యాడు. అంతేకాదు, తన కేబినెట్‌లో నారాయణకు నెంబర్ టూ పొజిషన్ ఇచ్చాడు చంద్రబాబు. రాజధాని వ్యాపార లావాదేవీలన్నీ నారాయణే చూసుకుంటున్నాడు. సొంత జిల్లాతో మాత్రం నారాయణ అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడు. ఈ సమయంలో సోమిరెడ్డికి మంత్రి పదవి ఇస్తే నారాయణ బలహీనమైపోతాడు. జిల్లాలో నారాయణ గురించి పట్టించుకునే వాడే వుండడు. నారాయణ వచ్చినప్పుడు వెనుక చేరుతున్న ఆ నలుగురు కూడా సోమిరెడ్డి వద్దకు పరుగులు తీస్తారు. నెల్లూరుజిల్లాలో నారాయణ ప్రాబల్యం దెబ్బతినకూడదనేది చంద్రబాబు ఉద్దేశ్యం. అందుకే సోమిరెడ్డికి ఎమ్మెల్సీ ఇచ్చే ముందు కూడా నారాయణను ఓవర్‌లుక్ చేయొద్దని, ఎమ్మెల్సీ కాగానే మంత్రి పదవి కావాలంటూ రావొద్దని చంద్రబాబు హెచ్చరించినట్లు తెలుస్తోంది.

రాజకీయంగా చూస్తే 'రెడ్డి' సామాజిక వర్గం నుండి సోమిరెడ్డికే మంత్రి ఇవ్వాలి. కాని నారాయణను దృష్టిలో పెట్టుకుని చూస్తే ఇవ్వలేరు. అందుకే అదే సామాజికవర్గం నుండి సోమిరెడ్డికి ప్రత్యామ్నాయంగా మాగుంట శ్రీనివాసులురెడ్డిని తెరమీదకు తెచ్చారు. మాగుంట శీనయ్యది నెల్లూరైనా ప్రకాశం ఖాతాలోకి పోతాడు. నెల్లూరులో ఆయన చేసేదేమీ లేదు. నారాయణకు అడ్డం రాడు. అదీగాక వ్యాపారవేత్త. భవిష్యత్‌లో పార్టీకి ఆర్థిక ప్రయోజనాలుంటాయి. మాగుంటకు ప్రకాశంతో పాటు నెల్లూరుజిల్లాలోనూ కేడర్ వుంది కాబట్టి రెండుజిల్లాల్లోనూ బలం పెంచుకోవచ్చు. ఇన్ని ఆలోచనలు చేసే మాగుంటను ఎమ్మెల్సీగా దించారు. రేపు మంత్రివర్గ విస్తరణ అంటూ జరిగితే సోమిరెడ్డి కంటే కూడా ఎక్కువ అవకాశం మాగుంట శీనయ్యకే వుంది. ఎందుకంటే ఇంకో నాలుగేళ్లదాకా ఎన్నికలు లేవు. ఇప్పుడే పార్టీ ప్రయోజనాల గురించి ఆలోచించాల్సిన పనిలేదు. ఒకవేళ చంద్రబాబు నెల్లూరుజిల్లాలో పార్టీ కేడర్‌ను పటిష్టం చేయాలని భావించినా, కార్యకర్తలకు పనిచేసే మంత్రిని అందించాలని ఆలోచన చేసినా సోమిరెడ్డిని కూడా ఇప్పుడే మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశముంది. ఇది రెడ్ల ప్రాబల్యంగల జిల్లా. మంత్రిగా ఆ వర్గం వాళ్లు ఉండటం అవసరం. ఈ దిశగా చంద్రబాబు ఆలోచిస్తే సోమిరెడ్డి మరోసారి నక్కతోకను తొక్కినట్లే!




ఉత్తరక్రియలు

మా తండ్రిగారైన
శ్రీ నల్లపరెడ్డి హరనాథరెడ్డి గారు
తే. 03.07.2015ది శుక్రవారం స్వర్గస్థులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారులు:
నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి
ఎంపిపి, కోట
నల్లపరెడ్డి కార్తీక్‌రెడ్డి
మరియు కుటుంబసభ్యులు

పెద్దకర్మ
తే. 14.07.2015ది మంగళవారం రాత్రి శిలాప్రతిష్ఠ
తే. 15.07.2015ది బుధవారం కర్మక్రియలు
కోట గ్రామంలోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.


# సివిల్స్‌లో మెరిసిన సింహపురి బిడ్డలు



అభిషిక్త్ కిషోర్

సింహపురి యువకులు సివిల్స్ ఫలితాల్లో అదరగొట్టారు. నెల్లూరుజిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేశారు. అతి చిన్నవయస్సులోనే సివిల్స్ ర్యాంకర్లుగా నిలిచారు. నెల్లూరుకు చెందిన ముట్టింబాకు అభిషిక్త్ కిషోర్ 166వ ర్యాంకును సాధించి నెల్లూరీయులు గర్వపడేలా చేశాడు. కిషోర్ తల్లి జయభారతి దక్కిలిలోని సాంఘిక సంక్షేమ వసతిగృహంలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తుండగా తండ్రి ఎంబివి కిషోర్ చెన్నైలోని ఆంధ్రాబ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అభిషిక్త్ సోదరుడు అభిలాష్ అమెరికాలో ఎంబిఏ చదువుతున్నాడు. చిన్ననాటి నుండి సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో శ్రమించి అభిషిక్త్ తన పంతం నెరవేర్చుకున్నాడు.

అలాగే, నెల్లూరు జిల్లా నాయుడుపేట పట్టణానికి చెందిన ఎద్దల బాలాజి కిరణ్ 950వ ర్యాంకు సాధించారు. 2013లో సివిల్స్ ఫలితాల్లో 846వ ర్యాంకు సాధించిన బాలాజి కిరణ్ ప్రస్తుతం ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీసులో శిక్షణ పొందుతున్నారు. రెండవ పర్యాయం సాధించిన 950 ర్యాంక్‌కు సిద్ధంగా ఉన్నట్లు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. సివిల్స్‌లో ర్యాంకులు సాధించి నెల్లూరు ప్రతిష్టను చాటిన విజేతలకు 'లాయర్' అభినందనలు.

# కాలుష్యంపై కన్నెర్రజేసిన కోటంరెడ్డి



నెల్లూరు నగర పరిసరాలలో పెద్దగా పరిశ్రమలు లేవుగాని, ఉన్న అరకొర పరిశ్రమల వల్ల స్థానికంగా నివాసం ఉండే వాళ్లు కాలుష్యం కాటుకు గురవుతున్నారు. కాలుష్యం బారినపడితే చిన్నా చితకా జబ్బులు రావడం లేదు. ఏకంగా పైకి పంపే పెద్దజబ్బులే వస్తున్నాయి. ఈమధ్య తీరప్రాంతంలో కుప్పలు తెప్పలుగా వస్తున్న విద్యుత్ ప్రాజెక్టుల మూలంగా కాలుష్యం పెరిగిపోతుండడం చూస్తున్నాం. దీనివల్ల నెల్లూరు, ముత్తుకూరురోడ్డులో ధనలక్ష్మీ పురం దాటిపోయి కాపురాలుండడానికి జనం భయపడుతున్నారు. విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా జిల్లాలో పెద్దఎత్తున ఆందోళనలు జరగడం కూడా చూసాము. నెల్లూరు శివార్లలో కొన్ని ప్రాంతాలు కాలుష్యం బారిన పడుతున్నాయి. ముఖ్యంగా అల్లీపురం, సౌత్‌రాజుపాలెం, నవాబుపేట, కిసాన్‌నగర్, నవలాకులతోట వంటి ప్రాంతాలు వీటిలో ప్రధానంగా వున్నాయి. ఇక్కడ బాయిల్డ్ రైస్‌మిల్లులు ఎక్కువ. వీటి నుండి వచ్చే కాలుష్యం స్థానిక ప్రజలను బాగా ఇబ్బంది పెడుతుంది. నెల్లూరు చుట్టుపక్కల ఉండే రైస్‌మిల్లులను రాచర్లపాడు వద్దగల ఇఫ్కో కిసాన్‌సెజ్‌కు తరలించాలనే ప్రతిపాదన వుంది. అయితే ఇంకా ఆచరణ రూపం దాల్చలేదు. ఇటీవల గ్రామీణ ఎమ్మెల్యే, నెల్లూరు రూరల్ దేవరపాలెం సమీపంలో చెరువును పరిశీలించారు. అక్కడే వున్న ఒక డెయిరీ వారు తమ ఫ్యాక్టరీ వ్యర్థాలను పైప్‌లైన్‌ల ద్వారా చెరువులోకి వదలడం గమనించి ఆ ఫ్యాక్టరీ యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన యాజమాన్యం ఆ వ్యర్థాలను చెరువులో కలవకుండా తగిన జాగ్రత్తచర్యలు చేపట్టింది.

అలాగే నవలాకులతోటలోని ఓ పవర్ ప్రాజెక్ట్ మూలంగా స్థానికంగా వున్న ప్రజలు కాలుష్యం బారినపడుతున్నారు. గత కొన్నేళ్లుగా ఈ ప్రాజెక్టు నడుస్తోంది. ఇక్కడ కాలుష్యం వల్ల స్థానిక ప్రజలు శ్వాసకోశ, ఊపిరితిత్తుల వంటి వ్యాధులకు గురవుతున్నారు. ఇక్కడి కాలుష్యంపై కోటంరెడ్డి దండెత్తారు. కాలుష్యాన్ని నివారించాలంటూ పవర్‌ప్రాజెక్ట్ యాజమాన్యాన్ని కోరారు. యాజమాన్యం మాత్రం రాజకీయ, అధికార అండదండలతో కాలుష్య నియంత్రణ జోలికి పోలేదు. ఇప్పుడు కాలుష్య నియంత్రణ పనులు చేయాలంటే అధిక మొత్తంలో డబ్బు ఖర్చవుతుంది. అధికారులను లోబరచుకుని తమ ప్రాజెక్టుకు ఆటంకం లేకుండా చేసుకోవాలని యాజమాన్యం భావించింది. కానీ కోటంరెడ్డి కాలుష్యం లేకుండా చేసాక ప్రాజెక్ట్‌ను నడుపుకోవాలని హెచ్చరించారు. ఈ సమయంలోనే ఎమ్మెల్యేకు నెల్లూరు ఆర్డీఓకు మధ్య చిన్నపాటి వివాదం నడిచి పత్రికలకెక్కింది. నెల్లూరురూరల్‌లో కాలుష్య కాసారాలపై కోటంరెడ్డి దృష్టి పెట్టడం, కాలుష్యం నుండి ప్రజలకు విముక్తి కల్పించే దిశగా ప్రయత్నిస్తుండడం అభినందనీయం.






Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY. e-mail: roopagroup@yahoo.com